APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 240 | ఎడిటర్ : ఎం. రమేష్ | శనివారం, ఆగష్టు 10, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

# గిరిజనులను.. ముందుకు నడిపించాలి









**రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదర్శం కావాలి**
**గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక కృషి**
**ఆదివాసీ దినోత్సవంలో సిఎం చంద్రబాబు**

విజయవాడ,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్): గిరిజనులు ఇంకా వెనుకబడి ఉన్నారని,వారిని ఆదుకుని ముందుకు నడిపించాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి. అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలన అంతానికి పోరాడి ప్రాణ త్యాగం చేశారు. స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి కాగలిగారు. అంచెలంచెలుగా ఎదిగిన ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆఫ్రికా తర్వాత ప్రపంచంలో రెండో స్థానంలో గిరిజనులు ఉండే దేశం భారత్. అన్ని రంగాల్లో గిరిజనులు ముందుండాలనేదే నా ఆకాంక్ష. మారుమూల ప్రాంతాల్లో ఉండే గిరిజనులు అభివృద్ధి చెందాలి. ప్రధాని వచ్చినప్పుడు అరకు కాఫీ రుచి చూపించాం.తెదేపా ప్రభుత్వ హయాంలో ఏటా ఆదివాసీ దినోత్సవం నిర్వహించాం. గత ఐదేళ్లలో ఈ దినోత్సవాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆదివాసీలంటే శౌర్యం, సహజ ప్రతిభ, నైపుణ్యం కలిగిన వ్యక్తులు. దేశవ్యాప్తంగా 10.42 కోట్ల మంది గిరిజనులున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 27.39 లక్షల మంది ఉన్నారు' అని చంద్రబాబు తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ మహిళలతో కలిసి నృత్యం చేసిన సీఎం.. అనంతరం డప్పు వాయించారు. ఆ తర్వాత అరకు కాఫీ ఉత్పత్తులను పరిశీలించారు. సీఎం చంద్రబాబు, పలువురు ఎమ్మెల్యేలు కాఫీ రుచి చూశారు. అరకు కాఫీ మార్కెటింగ్ తదితర అంశాలపై అధికారులతో సీఎం మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



## ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెంచండి

**అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశం**

**అమరావతి,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్) :**

నాణ్యమైన విద్యాబోధనతో ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెంచాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సహకారంతో అమలవుతున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ ఫార్మేషన్ "సాల్ట్" ప్రాజెక్టు అమలు తీరుపై శుక్రవారం నాడు పాఠశాల విద్య అధికారులు, సంబంధిత ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సమావేశంలో అధికారులతో పలు కీలక అంశాలపై మంత్రి చర్చించారు. అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పాఠాశాలల్లో మెరుగైన విద్యను కల్పించాలని.. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి లోకేష్ వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేయాలని సూచించారు. అన్ని స్కూళ్లలో ఇంటర్ నెట్ తప్పని సరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సహా అందరం మోడల్ పీటీఎం సమావేశాలకు హాజరవుతామని వెల్లడించారు. జగన్ ప్రభుత్వం వేలకోట్లు వెచ్చిస్తే 2లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఎలా తగ్గారు? అని ప్రశ్నించారు. బాల్యం నుంచే మహిళలను గౌరవించేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు రావాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.



## సుప్రీంలో కవిత బెయిల్ పిటిషన్

**సోమవారం విచారణకు వచ్చే ఛాన్స్**

**న్యూఢిల్లీ,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

హైదరాబాద్: భారాస ఎమ్మెల్సీ కవిత సుప్రీకోర్టును ఆశ్రయించారు. దిల్లీ మద్యం విధానానికి సంబంధించి ఈడీ, సీబీఐ నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్లను తిరస్కరిస్తూ జులై 1న దిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జాబితాలో కవిత పిటిషన్ లిస్ట్ అయింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. గత ఐదు నెలలుగా కవిత తిహాడ్ జైలులోనే ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు.. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా జైలు నుంచి శుక్రవారం విడుదలయ్యారు. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తిహాడ్ జైలు నుంచి 17 నెలల తర్వాత ఈ సాయంత్రం బయటకు వచ్చారు.

## ప్రజల కోసమైనా జగన్ అసెంబ్లీకి రావాలి

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు**

**కాకినాడ,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

జగన్ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చి నియోజకవర్గ సమస్యలపై మాట్లాడాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో అయ్యన్నపాత్రుడు పర్యటించిన సందర్భంగా అయ్యన్న మీడియాతో మాట్లాడారు. జగన్ ఇప్పుడు సీఎం కాదు.. ఒక ఎమ్మెల్యే మాత్రమే. అసెంబ్లీకి వచ్చి జగన్‌ను గెలిపించిన నియోజకవర్గ ప్రజల సమస్యలపై చర్చించాలి. అసెంబ్లీకి రాననడం సరికాదు. జగన్‌కు నా సలహా ఒకటే. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి.. ఒక ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలి. దానికి నేను అవకాశం ఇస్తా. నేను అవకాశం ఇవ్వనని ఎందుకు అనుకుంటున్నారు. అన్ని పార్టీలకు ఇచ్చిన విధంగానే జగన్‌కు మాట్లాడటానికి అవకాశం ఇస్తా అని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలందరికీ తీగిన గౌరవం ఉందని అన్నారు. ఇందులో పార్టీలకు సంబంధం లేదన్నారు. ప్రజల సమస్యలపై మాట్లాడే అర్హత అందరికీ ఉందని అన్నారు.

## ఈయేడు ఘనంగా పంద్రాగస్ట్ వేడుకలు

**పంచాయితీలకు నిధులు పెంచుతూ పవన్ ఆదేశాలు**

**అమరావతి,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**



గ్రామాల్లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు వేడుకల నిర్వహణ కోసం పంచాయతీలకు నిధులు పెంచినట్లు తెలిపారు. మైనర్ పంచాయతీలకు రూ.100నుంచి రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.250 నుంచి రూ.25వేలకు పెంచినట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకూ ఇదే విధంగా నిధులు ఇస్తామన్నారు. పంద్రాగస్టున పాఠశాలల్లో డిబేట్, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు.. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి.. బహుమతులు ఇవ్వాలి. ఆగస్టు 15న పాఠశాలల్లో స్వాతంత్య్ర సమరయోధులను, రక్షణ రంగంలో పని చేసిన వారిని, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించాలి. పిల్లలందరికీ చాక్లెట్లు, బిస్కెట్లు ఇవ్వాలని పవన్ సూచించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# సుప్రీంతో లాపతా లేడీస్ చిత్ర ప్రదర్శన

**అమీర్ ఖాన్ రాకతో సిజెఐ సరదా వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం మరో అరుదైన సందర్భానికి వేదికైంది. బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'ను శుక్రవారం సుప్రీంకోర్టులో ప్రదర్శిచడమే అందుకు కారణం. సాయంత్రం 4.15 గంటల నుంచి ఈ సినిమా ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్, ఆ చిత్ర దర్శకురాలు కిరణ్ రావ్ ఆ సినిమాను వీక్షించేందుకు సుప్రీంకోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమిర్ వస్తున్నట్లు ప్రకటించిన సందర్భంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ సరదా వ్యాఖ్యలు చేశారు. కోర్టులో తొక్కిసలాట తరహా పరిస్థితిని నేను కోరుకోను. కానీ ఈరోజు ఇక్కడ ఆమిర్ ఉన్నారు..అంటూ చమత్కరించారు. ఈ సినిమాను సీజేఐ, ఇతర న్యాయమూర్తులు, వారి కుటుంబాలు, ఇతర సిబ్బంది వీక్షించారు. తన చిత్రాలతో సామాజిక అంశాలను లేవనెత్తే ఆమిర్ సొంత బ్యానర్‌పై 'లాపతా లేడీస్ తెరకెక్కిన విషయం తెలిసిందే. 2001లో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువ వధువులు రైలు ప్రయాణంలో తప్పిపోయిన సంఘటన ఇతివృత్తంగా దీన్ని తెరకెక్కించారు. లింగ సమానత్వాన్ని చాటిచెప్పే ఈ కామెడీ డ్రామా ఫిల్మ్.. ఈ ఏడాది మార్చిలో విడుదలై సినీ ప్రముఖులు, విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైనా ఓటీటీలో సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. అంతేకాకుండా విడుదలకు ముందుగానే సెప్టెంబరు 8న ఈ సినిమాను ప్రతిష్ఠాత్మక టోరంటో ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్) వేడుకలో ప్రదర్శించారు. ఈ వినోదభరితమైన చిత్రంలో నితాన్షీ గోయల్, ప్రతిభా రంతా, స్పర్శ్ శ్రీవాస్తవ, ఛాయా కదమ్, రవికిషన్ కీలక పాత్రలు పోషించారు.

# నచ్చిన దుస్తులు ధరించే అవకాశం ఉండాలి

**కాలేజీ క్యాంపస్‌లో హిజాబ్, బుర్ఖా, నిఖాబ్ నిషేధం సరికాదు**

**చెంబూరు కళాశాల ఉత్తర్వులపై స్టే విధించిన సుప్రీం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్) :**

కాలేజీ క్యాంపస్‌లో హిజాబ్, బుర్ఖా, నిఖాబ్ ధరించకూడదంటూ చెంబూరు కళాశాల జారీ చేసిన సర్క్యులర్‌పై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం స్టే విధించింది. ముంబయిలోని ఎన్‌జి ఆచార్య, డికె మరాఠే కాలేజీకి చెందిన ముస్లిం విద్యార్థినులు దాఖలు చేసిన పటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కళాశాల విధించిన షరతులపై జస్టిస్ సంజీవ్‌ఖన్నా, సంజరుకుమార్ ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కాలేజీ యాజమాన్యం వాదనలపై జస్టిస్ సంజీవ్‌ఖన్నా ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల పేర్లు మతాన్ని బహిర్గతం చేయడం లేదా నెంబర్స్ ద్వారా వారిని గుర్తించమని అడుగుతారా? అంటూ జస్టిస్ సంజరుకుమార్ ప్రశ్నించారు. కాలేజీ తరపు సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ ఇది ప్రైవేట్ సంస్థ అని చెప్పగా.. కాలేజీ ఎప్పటి నుంచి పని చేస్తుందని జస్టిస్ సంజరుకుమార్ ప్రశ్నించారు. 2008 నుంచి కళాశాల ఉనికిలో ఉందని చెప్పగా.. ఇన్నాళ్లు మీరు ఎందుకు సూచనలు చేయలేదు? మతాన్ని అకస్మాత్తుగా గుర్తించారా? ఏళ్ల తర్వాత ఇలాంటి సూచనలు చేయడం దురదృష్టకరమని.. తిలకం ధరించిన వారిని సైతం అనుమతించబోమని చెబుతారా? అంటూ జస్టిస్ ఖన్నా న్యాయవాదిని ప్రశ్నించారు. కాగా, 441 మంది ముస్లిం విద్యార్థులు కళాశాలకు సంతోషంగా హాజరవుతు న్నారని.. కొందరు మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు. అయితే నచ్చిన దుస్తులు ధరించేందుకు విద్యార్థులకు అవకాశం ఉండాలని న్యాయస్థానం తెలిపింది. ఈ విషయంలో స్పందన చెప్పాలని ముంబయి ఎడ్యుకేషన్ సొసైటీని సుప్రీంకోర్టు కోరింది. ఈమేరకు కళాశాలకు నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను నవంబర్‌కి వాయిదా వేసింది. స్టే ఆర్డర్‌ను ఎవరూ దుర్వినియోగం చేయొద్దని బెంచ్ స్పష్టం చేసింది. ఆర్డర్‌లో సవరణలు కోరేందుకు కళాశాల అధికారులకు అనుమతి ఇచ్చింది.

# ఘనంగా ఆదివాసీ దినోత్సవం

**- ఆదివాసీలది ప్రాచీన సంస్కృతి - దీని పరిరక్షణకు ప్రభుత్వం కృషి**

**- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా వేడుకలను నిర్వహించింది. హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న కుమ్రం భీమ్ ఆదివాసి భవన్ లో జరిగిన ఈ వేడుకలలో ముఖ్య అతిథులుగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,ంచాయితీరాజ్ శాఖామాత్యులు దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నివసిస్తున్న ఆదివాసులది ప్రత్యేకమైన సంస్కృతి అని, ఈ సంస్కృతి పరిరక్షణకు ప్రస్తుత ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని కొనియాడారు. సీతక్క మాట్లాడుతూ 'ఆదివాసీ సంస్కృతి ప్రత్యేకమైనది, ప్రాచీనమైనది, శాస్త్రీయ మైనదని, ఒకప్పుడు ధనికులు చీదరించుకున్న ఆదివాసీ సంస్కృతే ఇప్పుడు శాస్త్రీయమైనదని, ఆరోగ్యకరమైనదని పాటిస్తున్నారు. ఉదాహరణగా ఇప్ప పువ్వులను తీసుకుంటే... ఇప్ప పువ్వు, కాయల నుంచి ఎన్నో రకాల ఆహార పదార్థాలు, నూనెలు, చివరికి కల్లును కూడా ఆదివాసీలు తయారు చేసుకుంటారు. కాబట్టి ఇప్ప పువ్వుల చెట్టు వంటి ఎన్నో రకాల చెట్లను ఆదివాసీలు కొట్టక అటవీ సంరక్షణ చేస్తుంటారు. ఇలాంటి ఆదివాసీ జీవనమే నాగరిక ప్రజలకు కూడా ఆదర్శం, ఆచరణీయం' అన్నారు. వేడుకలలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన తెగలకు చెందిన ఆదివాసీ కళాకారులు తమ ఆటపాటలతో అతిథులను ఆహ్వానం పలికారు. అనంతరం అతిథులు సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద, కుమ్రం భీమ్, రాంజీ గోండ్ విగ్రహాల వద్ద పూజలు చేశారు. ఆ తరువాత ఆదివాసీ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ ఉత్పత్తులు, హస్తకళలను తిలకించి కొన్ని కళాఖండాలను కొనుగోలు చేశారు. కార్యక్రమాలలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులు, ఆటగాళ్లు, కుటీర పరిశ్రమల బృందాలను అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జాటోత్ రాంచందర్ నాయక్, డాక్టర్ మురళీ నాయక్ భూక్యా (మహబూబాబాద్), బెల్లయ్య నాయక్, ట్రైకార్ ఛైర్మన్, డా ఎ.శరత్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కె. సీతాలక్ష్మి, సెక్రటరీ, గురుకులం, ఇతర ఉన్నతాధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు, కుల పెద్దలు, మేడారం జాతర పూజార్ల సంఘం అధ్యక్షులు దిద్దబోయిన జగ్గారావు బృందం తదితరులు పాల్గొన్నారు. అతిథులకు ఆదివాసీ వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు.

# రవాణాశాఖలో ప్రక్షాళన చేపడతాం







**పోర్టుకు బియ్యం తరలుతున్నా పట్టింపేది**

**త్వరలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం**

**మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెల్లడి**

**విజయవాడ,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

రవాణా శాఖలో ప్రక్షాళనకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రవాణా శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం నాడు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రి చర్చించారు. రవాణా శాఖలో కొందరు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా శాఖలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని సీరియస్ అయ్యారు. గత ఐదేళ్లలో చౌకబియ్యం కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలి వెళ్లాయని ఆరోపించారు. అక్రమంగా వెళ్తున్న వాహనాలను పట్టుకోకపోవడమేంటని ఆర్టీఏ అధికారులను ప్రశ్నించారు. గతంలో రాష్ట్రంలో అక్రమంగా ఇసుక, ఖనిజాలు తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేయకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. అక్రమంగా ఇసుక, మైన్స్ తరలింపు వాహనాలపై చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఏపీలో ఒకే నెంబర్‌తో పలు వాహనాలు తిరుగుతున్నాయని వాటిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. నిరంతరం తనిఖీలు చేసి అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీఏ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్లలో రవాణా శాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం సమూల ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. రవాణాశాఖలో అవినీతి, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అక్రమార్కుల పనిపట్టి ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వైసీపీ పాలనలో ఆర్టీసీలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాల వల్ల 2019-24 మధ్య ఆర్టీసీ నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం చెల్లించని బకాయిలు, సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. అమరావతి బ్రాండ్ ఏసీ బస్సులను పూర్వవైభవం తీసుకువస్తామని ఉద్ఘాటించారు. ఒవర్ లోడ్ , ఫిట్ నెస్ లేకుండా, తిరుగుతున్న వాహనాలపై తనిఖీలు చేసి జప్తు చేయాలని అధికారులకు ఆదేశాలు విడుదల చేశారు. ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్లు, సిబ్బంది కొరత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సులు , బస్టాండ్లలో పరిశుభ్రతను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కారుణ్య నియామకాల్లో జాప్యాన్ని నివారించి వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యమైందని మండిపడ్డారు. కారుణ్య నియామకాలపై చర్చించామన్న ఆయన.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎంతో చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో రేషన్, మైన్స్ అక్రమ రవాణాను నివారిస్తామన్నారు. ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను తొలగించి కొత్తవి తీసుకొస్తామని చెప్పారు. ఆర్టీసీలో 7 వేల మంది సిబ్బంది కొరత ఉందని.. వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుటుందని తెలిపారు. ఆర్టీసీ, రవాణా శాఖలపై ఈనెల 12న మరోసారి సీఎం సమీక్షిస్తారన్న ఆయన.. మహిళలకు ఉచిత ప్రయాణం అమలుపై సీఎం చర్చిస్తారని చెప్పారు.

# పెన్షన్ డబ్బుల కోసం గొడవ

**తల్లికి ఉరేసి చంపిన కిరాతక కొడుకు**

**మెదక్,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్) :**

పింఛన్ డబ్బుల కోసం కన్నతల్లినే ఓ దుర్మార్గపు కొడుకు కడతేర్చాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేటకు చెందిన రామచంద్రం గత కొన్ని ఏండ్లుగా మద్యానికి బానిపై డబ్బుల కోసం ఇంట్లో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పింఛన్ డబ్బులు ఇవ్వాలని తల్లి దుర్గవ్వ(70)తో రామచంద్రం గొడువపడ్డాడు. మద్యం మత్తులో చున్నీతో తల్లి మెడకు ఉరివేసి హత్య చేశాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు కూతురు విజయ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# రహస్యంగా రెండో పెళ్లికి సిద్ధం అయిన భర్త

**మొదటి భార్య రావడంతో పెళ్లిపీటల మీది నుంచి జంప్**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**తిరుమల,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్) :**

తన భార్యకు తెలియకుండా సీక్రెట్‌గా రెండో పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడో ప్రబుద్ధుడు. హైదరాబాద్ నుంచి తిరుమలకు వచ్చి మరీ పెళ్లికి సిద్ధమయ్యాడు. కానీ సడెన్‌గా మొదటి భార్య రాకతో అతని ప్లాన్ బెడిసికొట్టింది. భర్త కుట్రను ఎలాగో తెలుసుకున్న భార్య తన కుటుంబసభ్యులతో కలిసి పెళ్లి సమయానికి కల్యాణ మండపానికి చేరుకుంది. దీంతో పెళ్లిపీటల మీద నుంచి వరుడు పలాయనం చిత్తగించాడు. తిరుమలలో కలకలం సృష్టించిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రాకేశ్‌కు వరంగల్ జిల్లా పెద్ద పెండ్యాలకు చెందిన సంధ్యతో వివాహమైంది. వారికి ఏడేళ్ల కుమార్తె కూడా ఉంది. కానీ సంధ్యకు విడాకులు ఇవ్వాలని రాకేశ్ అనుకున్నాడు. విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలోనే మొదటి భార్యకు తెలియకుండా రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తిరుమలలోని గోగర్భం డ్యామ్ వద్ద ఉన్న ఓ మఠంలో రెండో పెళ్లి చేసుకోబోయాడు. అయితే తన భర్త రెండో వివాహం గురించి తెలుసుకున్న సంధ్య తన కుమార్తె, కుటుంబసభ్యులతో కలిసి కల్యాణ మండపానికి చేరుకుంది. కళ్యాణ మండపం వద్దకు తన మొదటి భార్య సంధ్య రావడం గమనించిన రాకేశ్, అతని కుటుంబ సభ్యులు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో అక్కడ ఉన్న కొంతమందిని సంధ్య కుటుంబ సభ్యులు పట్టుకుని తిరుమల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాగా, తనకు న్యాయస్థానం ఇంకా విడాకులు మంజూరు చేయలేదని.. తన భర్తతో ఉండేందుకు కోర్టు తమకు అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. కానీ రాజకీయ నాయకుల అండదండలతో తన భర్త తనను ఇంటి నుంచి తరిమేశారని వాపోయింది. తన భర్త రెండో పెళ్లికి సిద్ధమయ్యాడని తెలుసుకుని తిరుమలకు వచ్చి ఆపేశానని చెప్పింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# విత్తన కొరత లేదని చెప్పగలరా

**మంత్రి అచ్చన్న కౌంటర్ల వద్దకు వెళ్లారా**

**పల్నాడు జిల్లాలో రైతుల కష్టాలు కనిపించడం లేద**

**మంత్రి అచ్చన్నాయుడుపై మండిపడ్డ షర్మిల**




**అమరావతి,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

విత్తనాల కొరతపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన వివరణ తలా తోక లేనిదని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. సాగర్ కుడికాలువ కింద రైతులకు విత్తన కొరత లేదని గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పగలరా అని ఆమె ప్రశ్నించారు. పల్నాడు జిల్లాలో కౌంటర్ల దగ్గర రైతుల పడుతున్న కష్టాలు మీకు కనిపించడం లేదా అని నిలదీశారు. సంబంధిత శాఖ మంత్రిగా నేరుగా పరిస్థితి చూసే మాట్లాడుతున్నారా అని షర్మిల విస్మయం వ్యక్తం చేశారు. రాత్రంతా క్యూలైన్లో రైతులను నిలబెట్టడమా మీ కూటమి ప్రభుత్వ ఏలుబడి అని ఆమె ప్రశ్నించారు. సంక్షోభం నుంచి సంక్షేమం అంటే కుండపోత వర్షంలో మహిళలను ఇబ్బందులు పాలు చేయడమే కాబోలు అని షర్మిల ఎద్దేవా చేశారు. రైతుల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పే దమ్ము లేక కుటుంబాన్ని గుంజు తున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టకనే కదా మీకు పట్టం కట్టింది, జగన్ నిండా ముంచారనే కదా 11 సీట్లకు పరిమితం చేసిందని టీడీపీ ప్రభుత్వంపై షర్మిల ప్రశ్నలు సంధించారు. మోసం చేశారనే కదా కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని వైసీపీ పాలనపై షర్మిల విమర్శలు చేశారు. రైతులను వ్యతిరేకించే బీజేపీతో మీరు కూటమి కట్టి, పక్షపాతిగా ఉంటామని హామీలు ఇచ్చి, గద్దెనెక్కి, ఇప్పుడు వాళ్లను వర్షంలో నిలబెట్టారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మీ సర్కారుకి న్యాయమా అని ప్రశ్నించారు. నాట్లు వేసిన 130 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని జేజీఎల్ 384 రకం విత్తనాలను కావాలని అడగడం రైతులు చేసిన పాపం అంటారా అని నిలదీశారు. రైతు అడిగింది ఇవ్వాలని హక్కుగా మేము ప్రశ్నిస్తే రెచ్చగొట్టినట్లు ఎలా అవుతుందో, వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శనివారం । ఆగస్టు । 10 । 2024



# చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొని రండి





**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల/పాణ్యం, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం పాణ్యం మండల కేంద్రం, బలపనూరు గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా చెత్త నుండి సంపద సృష్టించే తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో ఉన్న 325 చెత్త సంపద కేంద్రాలను అక్టోబర్ 2 నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలను ఇవ్వాలని డిపిఓ మంజులవాణిని కలెక్టర్ ఆదేశించారు. క్లాత్ మిత్ర సిబ్బందికి పంచాయతీని నుండి వేతనాలు చెల్లించే ప్రాంతాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాల్లో వర్మి కంపోస్ట్ ఎరువు తయారవుతోందని, వేతనాలు చెల్లించని ప్రాంతాల్లో సరిగా జరగడంలేదని డిపిఓ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని షెడ్లకు పైకప్పు లేకపోవడం, చిన్నచిన్న మరమ్మత్తులు, నిర్వహణ లేకపోవడం వల్ల కూడా సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయన్నారు. సిబ్బంది వేతనాలకు సంబంధించి, నిర్వహణపై ప్రభుత్వం దృష్టికి ప్రతిపాదనలు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంల నుండి పారిశుద్ధ్య కార్యక్రమాలపై కలెక్టర్ ఆరా తీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న ప్రజలతో కలెక్టర్ సంభాషిస్తూ సమస్యలపై వివరాలు సేకరించగా రసూల్ పేటకు వెళ్లే దారిలో వంక ప్రవహిస్తోందని బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ను కోరారు. 100 రోజుల ప్రణాళికలో బ్రిడ్జి ఏర్పాటు ప్రతిపాదనలు చేర్చి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.

# ఆదివాసీల సాంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తాం..





**పత్తికొండ శాసనసభ్యులు కేఈ.శ్యాం కుమార్**

**కర్నూలు, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు నగరంలో కలెక్టర్ కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న ఎమ్మెల్యే కేఈ.శ్యాం కుమార్ మాట్లాడుతూ ఆదివాసీల సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. ఆదివాసీల సంస్కృతికి నిదర్శనమైన 'ఆదివాసీల భాష'ను సంరక్షించి సవర భాషకు లిపిని నిక్షిప్తం చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు గారి స్ఫూర్తితో ఆదివాసీల సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రపంచ సంస్కృతి, సమిష్టి జీవన విధానానికి ప్రాథమిక సాక్ష్యం ఆదివాసీలు.. పరస్పర సహకారం, నిష్కల్మష జీవితాలకు నిలువుటద్దం గిరి పుత్రులు అని కొనియాడారు. సహజ వాతావరణంలో స్వచ్ఛమైన జీవన విధానంలో జీవనం సాగిస్తున్న గిరిపుత్రుల సమగ్ర అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు.అలాగే పత్తికొండ నియోజకవర్గం లో దాదాపుగా 16 నుండి 18 దాకా గిరిజన తండాలు ఉన్నాయి వాటి లో ప్రతి ఒక్క తండాలకు బీటీ రోడ్లు, సిసి రోడ్లు తాగునీటి సదుపాయాలు ప్రత్యేక పంచాయితీలు ఏర్పాటు చేసి మీ పంచాయితీలకు మీరే ప్రజా ప్రతినిధుల గా ఉండే విధంగా చేశాము అని అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరి పుత్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం శాసనసభ సభ్యురాలు గౌరు చరితమ్మ, కోడుమూరు శాసనసభ సభ్యులు బొగ్గుల దస్తగిరి,లంబాడి,ఎరుకుల, గిరిజన సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబాయ్ గాంధీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా బంగి రోజా ఏకగ్రీవం





**దేవనకొండ, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

మండల కేంద్రంలో గురువారం విద్యా కమిటీ చైర్మన్ పదవులు ఎన్నుకోవడం జరిగింది. మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాల నందు జనసేన కార్యకర్తని కూటమి బలోపేతంతో విద్యార్థినిల తల్లిదండ్రుల సమక్షంలో బంగి రోజా భర్త బంకి బాలు విద్యా కమిటీ చైర్మన్ గా ఏకగ్రీవం ఎన్నుకోవడం జరిగింది. వైస్ చైర్మన్ గా వెంకటాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త రవి భార్య జయలక్ష్మి ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ రోజా మాట్లాడుతూ విద్యార్థినిల సంబంధించిన ఏ విషయంలోనైనా నేను చురుకుగా పాల్గొంటానని, పాఠశాల అభివృద్ధికి పిల్లల భవిష్యత్తు కోసం పనిచేస్తానని, విద్యార్థినీలకు ఎలాంటి సమస్యలు ఉన్న నేను ముందుండి పోరాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ సునీత టిడిపి మండల సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి ఉచ్చరప్ప, సర్పంచ్ భర్త బండ్లయ్య, బండి గింజల రంగన్న, ఆకుల వీరేష్, పొట్లన్నగారి బండ్లయ్య, జనసేన నాయకులు మండల కో కన్వీనర్ కరిడికొండ నందు, ఉచ్చురప్ప, అంథోని, మాజీ ఆర్మీ రామాంజనేయులు, బంగి చంటిబాబు, విద్యార్థినిల తల్లిదండ్రులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలి



**శ్రీరంగపూర్/ వనపర్తి, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం తప్పకుండా డ్రై డే నిర్వహించాలని ఏంపీవో రాజు పేర్కొన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలో శుక్రవారం ఫ్రైడే - డ్రై డే సందర్భంగా అధికారులు పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రైనేజీ లో ఆయిల్ బాల్స్ వేయించారు. ఇంటి పరిసరాలలో డ్రమ్ములో, టైర్ లో నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ గట్టయ్య, పంచాయతీ సెక్రటరీ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ ధర్మరాజు, అంగన్వాడి టీచర్లు సంగీత, భారతి, చెన్నమ్మ, ఆశా కార్యకర్తలు శివలీల, సుగుణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కర్నూలు ప్రభుత్వాసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయండి

**ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాలను**
**త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోండి**
**కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డాకి వినతిపత్రం అందజేసిన**
**ఎం.పి బస్తిపాటి నాగరాజు**



**డిల్లీ, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయడంతో పాటు ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల ను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు కోరారు.. ఢిల్లీలోని నడ్డా కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు...ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలతో పాటు, తెలంగాణా, కర్ణాటక జిల్లాల వాసులకు కర్నూలు ప్రభుత్వాసుపత్రి వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఈ ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాలు కలిపించేందుకు అవకాశం ఉంటుందన్నారు.. ఇక ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించినప్పటికి ఇప్పటి వరకు కేవలం 50 శాతం పనులు మాత్రామే పూర్తి అయ్యాయన్నారు.. ఈ కళాశాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే ఆదోని మండలంతో పాటు, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, కోసిగి, ఆలూరు, కౌతాళం మండలాల వాసులకు అవసరమైన వైద్య సేవలను అందించవచ్చని నాగరాజు తెలిపారు.

## విద్యా కమిటీ చైర్మన్ గా ఎన్నికైన వారికి కృతజ్ఞతలు



**ఆలూరు, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆలూరు నియోజకవర్గం లో టిడిపి విద్యా కమిటీ చైర్మన్ లు ఎన్నుకోవడం జరిగింది. కావున ఆలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో ఆరు మండలాల మరియు గ్రామంలో విద్యా కమిటీ చైర్మన్ల ఎన్నిక ఘనంగా జరిగిన సందర్భంగా ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ 6 మండలాల తెలుగుదేశం తమ్ముళ్లకు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు చెప్పారు. జనసేన బిజెపి నాయకులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆరు మండలాల విద్యా కమిటీ చైర్మన్ మరియు వైస్ చైర్మన్లు టిడిపి సీనియర్ నాయకులు ఎంపీటీసీలు మాజీ మార్కెట్ చైర్మన్ లు సర్పంచులు వార్డ్ మెంబర్లు టిడిపి కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూమి పూజ

**కడప :** రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయంలో అభివృద్ధి పనులకు టిటిడి అధికారులు భూమి పూజ నిర్వహించారు. గర్భగుడిలో మరమ్మత్తులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. సెప్టెంబర్ నెల నుండి రెండు నెలలపాటు గర్భగుడిని మూసివేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నాం..





**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్**

**పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డితో కలిసి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌ను పరిశీలించిన మంత్రి భరత్**

**జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి యాజమాన్యం, పరిశ్రమల శాఖ అధికారులతో మంత్రి సమావేశం**

**ఓర్వకల్లు/ కర్నూలు, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి ఆయన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్‌ను పరిశీలించారు. అంతకుముందు ఎయిర్‌పోర్టు సమీపంలో టిడిపి ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు ఇండస్ట్రియల్ జోన్‌కు శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. కొందరు దుండగులు శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని ఆయన ఖండించారు. ఆ తర్వాత ఇండస్ట్రియల్ జోన్‌కు వెళ్లి అధికారులతో మాట్లాడారు. నీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. అనంతరం జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను మంత్రి టి.జి భరత్, ఎమ్మెల్యే చరితారెడ్డికి ఫ్యాక్టరీ యాజమాన్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సీఎం అవ్వడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన పరిశ్రమలు మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో విధ్వంసం తప్ప జరిగిందేమీ లేదన్నారు. తమ టిడిపి ప్రభుత్వం అభివృద్ధే మంత్రంగా ముందుకు వెళుతోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం.. మళ్లీ టిడిపి ప్రభుత్వం రావడంతో ఇప్పుడున్న ఫ్యాక్టరీని మరింత విస్తరించేందుకు ముందుకొస్తోందని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ సహకారం లేకపోవడంతో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం నెమ్మదిగా సాగిందన్నారు. ప్రభుత్వం తరుపున ఫ్యాక్టరీకి అందించాల్సిన విద్యుత్, వాటర్, రైల్వే సైడింగ్స్ ఏదీ గత ప్రభుత్వం చేయలేదన్నారు. పారిశ్రామికవేత్తలందరితో చర్చలు జరుపుతున్నామని.. వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వారందరూ ఆసక్తిగా ఉన్నట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీ నుండి వెళ్లిపోయిన ఓ పరిశ్రమ చెన్నైలో రూ.3 వేల కోట్లతో ప్లాంటును ఇప్పుడు నడుపుతుందని తెలిపారు. మళ్లీ మన రాష్ట్రానికి రావడానికి వాళ్లు ఆసక్తిగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్ లో మౌలిక సదుపాయాల కల్పనకు 1800 కోట్ల రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ గ్రీన్ జోన్‌లో ఉందని, ఓర్వకల్లు రెడ్ జోన్‌లో ఉండటంతో ఎలాంటి పరిశ్రమలైనా ఇక్కడ ఏర్పాటుచేయొచ్చన్నారు. ఇలాంటి చోట మౌలిక సదుపాయాలు బాగా కల్పిస్తే ఓర్వకల్లులో పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకే బెస్ట్ కన్సల్టెన్సీతో మాట్లాడి ఇండస్ట్రియల్ జోన్లో సమస్యలేమైనా ఉంటే గుర్తించి సరిచేసుకుంటామన్నారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తమ ప్రభుత్వం మరో రెండు దశాబ్దాల పాటు కొనసాగుతుందని.. పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఏపీని అభివృద్ధిలో ముందుకు తీసుకెళతామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్లో పెట్టుబడులు ఊహించిన దానికంటే ఎక్కువగానే వస్తాయన్నారు. ఇక్కడ నీరు, విద్యుత్, రోడ్డు, రైల్వే లైన్ ఇతర సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఇక్కడ అనేక పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఈ గ్రామాలలోని యువతకు ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ ఎండి కొయాంక, కర్నూల్ ఆర్డీవో శేషిరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం మారుతి ప్రసాద్, ఓర్వకల్లు తహసిల్దార్ వెంకటరమణ, ఇండస్ట్రియల్ ఏఈ సందీప్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా విగ్రహాలు, బొడ్రాళ్ళ ప్రతిష్టా...





**దేవనకొండ, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

మండల కేంద్రమైన దేవనకొండలో ఈరోజు చెన్నకేశవ స్వామి, వెంకటేశ్వర స్వామి,అభయాంజనేయ స్వామి విగ్రహాల మరియు గ్రామంలో మూడు చోట్ల బొడ్రాళ్ళ ప్రతిష్టలు బ్రాహ్మణుల హెూమ మంత్రాలతో ఘనంగా గ్రామ ప్రజలు నిర్వహించారు. ఈ శుభ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిలో ఆడపడుచులకు చీరలు పెట్టి ఒడిబియ్యాలను పోసి కనుల విందుగా ఈ కార్యక్రమమును గ్రామం మొత్తం పండుగ వాతావరణం లో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రాలు చదివే బ్రాహ్మణులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని విజయవంతంగా కార్యక్రమంను కొనసాగించారు.

## విద్య కమిటీ చైర్మన్ గా ఈడిగ చెన్నయ్య గౌడ్..



**దేవనకొండ,ఆగస్టు 9 (పీపుల్స్ మోటివేషన్):-**

దేవనకొండ మండలం భైరవకుంట గ్రామంలో ఉన్న ప్రైమరీ స్కూల్లో గురువారం విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. విద్యా కమిటీ చైర్మన్ గా ఈడిగ చెన్నయ్య గౌడ్, వైస్ చైర్మన్ గా జి రామాంజనేయులు నుఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పాఠశాల హెచ్ ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు పాల్గొన్నారు.

## పాల బిల్లులు చెల్లించాలంటూ రైతుల ఆందోళన

**జాతీయ రహదారిపై పాల డబ్బాలతో రాస్తారోకో**

**జనగామ,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్) :**

కాంగ్రెస్ ప్రభుత్వంపై పాడి రైతులు కన్నెర్ర చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆందోళన బాటపట్టారు. పాల బిల్లులు చెల్లించడం లేదంటూ జనగామ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై పాల డబ్బాలతో పాడి రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతుల ధర్నాతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాడి రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్ బిల్లుల కోసం పలుమార్లు ఎమ్మెల్యేలను, మంత్రులను కలిసినా ఫలితం లేదన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి రెండుసార్లు తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. తమ గురించి ప్రజా ప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని, సమస్యలు పరిష్కరించుకుండా ప్రజాప్రతినిధులు తమ గొప్పలను ప్రదర్శించేందుకు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మా బతుకు దెరువు పాడి అని, పాడితోనే బతుకులీడుస్తున్నామని, పాలబిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తమను రోడ్డు పాలు చేసిందని తీవ్రంగా మండిపడ్డారు. బిల్లులు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

## ప్రాజెక్టుల పేరుతో భారీగా దోపిడీ

**కాళేశ్వరంలో ప్రజల సొమ్ము లూటీ**

**సీతారామ ప్రాజెక్టులోనూ 8వేల కోట్లు కాజేశారు**

**ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన పొంగులేటి**

**ఖమ్మం,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోచుకుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమారు ఆరోపించారు. కాళేశ్వరం, ఇరిగేషన్‌లో ప్రజల సొమ్ము లూటీ చేశారని ఆరోపణలు చేశారు. శుక్రవారం నాడు ఏన్కూర్ వద్ద సీతారామ ప్రాజెక్ట్ కాలువల నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... రీ డిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్టుకు రూ. 18వేల కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పనులు చేపట్టి రూ.8 వేల కోట్ల ప్రజల సొమ్మును కాజేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు అన్ని సాగులోకి తెచ్చి రైతులకు ఉపయోగపడాలని శరవేగంగా పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీతారామతో లక్షా 35 వేల ఎకరాలు వైరా, లంకా సాగర్ ప్రాజెక్ట్‌లు మైనర్ ఇరిగేషన్‌లో అనుసంధానం చేస్తున్నామని అన్నారు. ఈ నెల 15వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు. రాబోయే కొద్ది రోజుల్లో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అడ్డంకులు ఉన్నా అధిగమిస్తామని అన్నారు. లక్షా 75 వేల ఎకరాలు సాగులోకి మొదటి విడతలో తీసుకురాబోతున్నామని చెప్పారు. రైతుల రుణమాఫీ చేశామని తెలిపారు. రూ.లక్షా 50 వేల నుంచి 2లక్షల వరకు బ్యాంకులో రుణం ఉన్న అన్నదాతలకు మాఫీ చేస్తామని, రూ.31వేల కోట్లు రైతులకు ఇచ్చే పరిస్థితి లేదని.. అయినా రైతుల ప్రభుత్వం కాబట్టి రుణమాఫీ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ. 2లక్షలకు పైగా రుణాలు దాటిన రైతులు నగదు చెల్లించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇస్తామని అన్నారు. మొదటి విడతగా 4లక్షల ఇళ్లు అందజేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తామని అన్నారు. తెల్ల రేషన్ కార్డుల కోసం పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. హెల్త్ కార్డు... తెల్లరేషన్ కార్డులు త్వరలోనే ఇస్తామని ప్రకటించారు.

## పంద్రాగస్ట్ వేడుకలకు ఏర్పాట్లు

**విజయవాడలో సిఎం చంద్రబాబు పతాకావిష్కరణ**

**కాకినాడలో డిప్యూటి సిఎం పవన్ జెండా వందనం**

**ఆయా జిల్లాల్లో పాల్గొనే మంత్రుల జాబితా విడుదల**

**అమరావతి,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై ఏపీ సాధారణ పరిపాలన శాఖ ప్రొటోకాల్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించే వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఉదయం 9 గంటలకు సీఎం ఆవిష్కరిస్తారని, జిల్లా స్థాయిలో మంత్రులు పతాకావిష్కరణ చేస్తారని తెలిపింది. ఈ మేరకు వేడుకల్లో పాల్గొనే మంత్రులు వివరాలను వెల్లడించింది. కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జాతీయ జెండాను ఎగురవేస్తారని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్ దినేశ్‌కుమార్ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపింది. జిల్లాల్లో పాల్గొనే మంత్రుల వివరాలను వెల్లడించింది. శ్రీకాకుళం- అచ్చెన్నాయుడు, విజయనగరం- కొండపల్లి శ్రీనివాస్, పార్వతీపురం మన్యం- గుమ్మిడి సంధ్యారాణి, విశాఖపట్నం- అనగాని సత్యప్రసాద్, అనకాపల్లి- వంగలపూడి అనిత, తూర్పుగోదావరి- కందుల దుర్గేశ్, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ- వాసంశెట్టి సుభాష్, పశ్చిమగోదావరి- నిమ్మల రామానాయుడు, ఏలూరు- కొలుసు పార్థసారథి, కృష్ణా- కొల్లు రవీంద్ర, గుంటూరు- నారా లోకేశ్ పల్నాడు- నాదెండ్ల మనోహర్, బాపట్ల- గొట్టిపాటి రవికుమార్, ప్రకాశం- డోలా బాలవీరాంజనేయస్వామి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు-పి. నారాయణ, చిత్తూరు- సత్యకుమార్, కడప- ఎన్ఎండీ ఫరూక్, అన్నమయ్య- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తిరుపతి- ఆనం రామనారాయణరెడ్డి, నంద్యాల- బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు- టీజీ భరత్, అనంతపురం- పయ్యావుల కేశవ్, శ్రీ సత్యసాయి- సవితలు జెండా ఆవిష్కరణలో పాల్గొంటారు.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation

శనివారం । ఆగస్టు । 10 । 2024

జనరల్ న్యూస్ 05

# కుండలెన్ని చేసినా.. కూటికి కటకటే
# పేదవాడి ఫ్రిజ్ కుండ





### గుర్తింపు కోల్పోతున్న కుమ్మరి వృత్తి
### కుమ్మరి అద్భుత డిజైనర్

పూర్వం నుండి కుటుంబ వృత్తిగా ఉన్న కుమ్మరి వారు నేడు కనుమరుగయ్యారు కేవలము కొన్ని గ్రామాలు తప్ప కుమ్మరులు కాన వచ్చుట లేదు కుమ్మరులు దీనినే ఒక పరిశ్రమగా విస్తరించి కేవలం కుండలే కాకుండా మట్టితో వివిధ రకాలైన అలంకరణ సామాగ్రి తయారు చేసేవారు ఒకప్పుడు మట్టితో తయారుచేసిన వస్తువులనే వాడేవారు మట్టి కుండలో ప్రతి ఇంట్లోనూ తాగే గ్లాసులు తప్ప మిగతావన్నీ మట్టితో చేసినవే సాంప్రదాయం మట్టికుండలో చేసిన వంటలు రుచిగా ఉంటాయని నమ్మేవారు ఆ తర్వాత కొంతకాలానికి లోహ పాత్రలు వచ్చిన వంటలకు మాత్రం మట్టి పాత్రలు వాడేవారు ఇళ్లల్లో ధాన్యం నిల్వ చేసుకోవడానికి మట్టి వస్తువులు బాన, నేల తొట్టె బావి మొదలగునవి మట్టితో చేసినవే ప్రస్తుతం ఇటువంటివి చాలా వరకు కనుమరుగయిన వి లోహ పాత్రలు అందుబాటులోకి వచ్చిన తరువాత కుమ్మరి వృత్తి పూర్తిగా అంతరించిపోయింది ప్రతి వారు తమ బ్రతుకు తెరువుకు ఇతర మార్గాల వైపు మరలి పోయారు ఈనాడు తరం వారికి అసలు కుండలు తయారీ ఎలా కూడా ఎవరికి తెలియదు, అసలు కుమ్మరి వృత్తి ఎంత కష్టం అనేది చూసే వారి కంటే చేసే వాడికే తెలుస్తుంది కుమ్మరి వారు సమీపంలో చెరువు నుండి ఒండ్రు మట్టిని సేకరించి దానిని మెత్తగా చేసి చిన్న చిన్న అందులో దాగి ఉన్న రాళ్లను వేరు చేసి నీళ్లతో తడిపి 4 ఐదు రోజులు నిల్వ ఉంచుతారు ఆ తర్వాత దానిని నీళ్లు కలిపి కాళ్లతో బాగా తొక్కుతారు అలా తయారైన మట్టిని సుమారు ఒక అడుగు కైవారం రెండు అడుగుల ఎత్తు ఉన్న స్థూపాకారంగా తయారుచేసి దానిని కుమ్మరి చక్రం మధ్యలో పెడతారు ఆ కుమ్మరి చక్రం సుమారు రెండడుగుల వ్యాసార్థం కలిగి క్రింద ఒక చిన్న లోహపు బుడిపె ఉంటాది.గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి ఉపాధి అవకాశాల కల్పనలో బహుముఖ పాత్ర పోషించే కులవృత్తులైన 'చేనేత', 'కుమ్మర వృత్తి', 'కమ్మరి', 'వడ్రంగి', 'మేదరి' మొదలగు వృతుల ఉత్పత్తులకు మార్కెట్లో గిరాకీ తగ్గడం వల్ల గ్రామీణ వృత్తుల మీద ఆధారపడిన కార్మికులు ఈ వృత్తులను వదులుకొని (నిష్క్రమించి) పట్టణాలకు వలస వెళ్ళి రోజు వారీ కూలీలుగా మారి శ్రామిక మార్కెట్లో ఎక్కువ గంటలు పని చేస్తూ తక్కువ వేతనాలు పొందుతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు పొందడం లేదు. గ్రామీణ చేతి వృత్తులు కూడు పెట్టని దశకు చేరుకున్నాయి.స్వాతంత్ర్యం ఇన్ని సం?రాలు అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'స్వదేశీ ఉత్పత్తుల' అభివృదికి, గ్రామీణ వృత్తుల ఆధునికీకరణకు అధునాతన సాంకేతికతను ఆశించిన మేరకు అందించడలో విఫలమైనాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి ఉపాధి అవకాశాల కల్పనలో బహుముఖ పాత్ర పోషించే కులవృత్తులైన 'చేనేత', 'కుమ్మర వృత్తి', 'కమ్మరి', 'వడ్రంగి', 'మేదరి' మొదలగు వృతుల ఉత్పత్తులకు మార్కెట్లో గిరాకీ తగ్గడం వల్ల గ్రామీణ వృత్తుల మీద ఆధారపడిన కార్మికులు ఈ వృత్తులను వదులుకొని (నిష్క్రమించి) పట్టణాలకు వలస వెళ్ళి రోజు వారీ కూలీలుగా మారి శ్రామిక మార్కెట్లో ఎక్కువ గంటలు పని చేస్తూ తక్కువ వేతనాలు పొందుతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు పొందడం లేదు. గ్రామీణ చేతి వృత్తులు కూడు పెట్టని దశకు చేరుకున్నాయి. నాడు 'కుల వృత్తిని మించింది లేదు గువ్వల చెన్నా' అన్న నానుడి నేడు 'కుల వృత్తులను వదిలించే మిన్న' అన్న సంస్కృతి సమాజంలో చోటు చేసుకుంది. ప్లాస్టిక్ ఉత్పత్తులకు, సిల్వర్ వస్తువులకు మార్కెట్ లో గిరాకీ పెరిగటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కుమ్మర వృత్తి కనుమరుగయ్యే పరిస్థితులు దాపురించాయి. ఎంతో 'కళా నైపుణ్యం'తో కూడుకొన్న కుమ్మర వృత్తి ఆదరణ లేక అంతరించే పరిస్థితులు నెలకొన్నాయి. కుమ్మర వృత్తి కూడు పెట్టని దుస్థితిలో కొట్టుమిట్టాడటం శోచనీయం.

**మానవ నాగరకత కుమ్మర వృత్తి..**

'మానవ నాగరికతకు తొలి మెట్టు కుమ్మరి కుండ ఆయువు పట్టుగా' నిలిచి మానవ చరిత్ర సంస్కృతి వారసత్వ అవశేషాల అధ్యయనానికి దోహదపడే కుమ్మర వృత్తి అంతరించే దశకు చేరుకుంది. మానవాళికి ఆహారాన్ని వండుకోవడానికి వంట పాత్రలు సమకూర్చి, మానవ జాతికి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించి (కలిగించి), ప్రజారోగ్యానికి పర్యావరణ పరిరక్షణకు ప్రతినిధిగా నిలిచిన కుమ్మర వృత్తి కార్మికులు ఉపాధి లేక దుర్భరమైన జీవితాలను వెళ్లదీస్తున్నారు.

**మానవ మనుగడ కుమ్మర వృత్తి..**

మనిషి పుట్టుక, పెళ్లి, చావు, దైవ కార్యక్రమాల్లో కుమ్మర ఉత్పత్తులు కుండలు 'గురుగులు కూర వండు కోవటానికి ఎసులలు అటికెలు నీటి నిలువకు తొట్టిలు రంజాన్‌లు, 'కదువలు' పెళ్ళిలో ఐరేని కుండలు వినియోగిస్తారు. మానవ మనుగడలో మట్టి పాత్రలు ప్రధాన పాత్ర పోషించాయన్నది చారిత్రిక సత్యం. ఇందుకు "మొహంజదారో", 'హరప్ప మెసపుటోనియా', సింధూ నాగరికత అధ్యయనాల్లో వెల్లడైంది.ఆధునిక కాలంలో నూతన గృహ ప్రవేశం, ప్రభుత్వ భవనాల భూమి పూజ, దేవతలకు సమర్పించే బోనా లు మొన్నగు శుభ, దైవ కార్యక్రమాల్లో కుమ్మర కుండలు ఉపయోగిస్తారు. మానవ జాతి మనుగడకు నాగరికత: సంస్కృతికి కుమ్మర కుండకు విడదీయ లేని సంబంధం వుంది. మట్టిని నమ్ముకొని మానవాళి మనుగడ కొరకు పర్యావరణ రక్షణకు కవచంగా నిలిచిన కుమ్మర కుల వృత్తి ఉనికిని కోల్పోయే స్థితిలో వుంది.

**ప్రపంచీకరణ కుమ్మర వృత్తి..**

ప్రపంచీకరణ విసిరిన పంజాకు కుమ్మర వృత్తి కుదేలైంది. వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, కార్పొరేటీకరణ, పట్టణీకరణ జనాభా పెరుగుదల ప్లాస్టిక్ వినియోగంపై పెరిగిన క్రేజీ మార్కెట్ ప్రకటనల వల్ల ప్రజల్లో పెరిగిన విదేశీ సంస్కృతి స్టీలు పాత్రలు, ప్లాస్టిక్ , సిల్వర్, అల్యూమినియం వినియోగం బాగా పెరిగింది. మార్కెట్ మాయాజాలంలో మట్టి పాత్రలకు ఆదరణ లేక డిమాండ్ తగ్గింది. కుమ్మర వృత్తి కూడుపెట్టని స్థితికి దిగజారింది. కుల వృత్తిని వదులుకొని ప్రైవేట్ అసంఘటిత రంగంలోకి కుమ్మరి వృత్తి కార్మికులు వలసపోయి అల్పవేతనాలకు పని చేస్తూ శ్రమ దోపిడీకి గురై రెక్కాడితే డొక్కాడని స్థితిలో కఠిన పేదరికం అనారోగ్యానికి గురవుతున్నారు. దినసరి వేతన కార్మికులుగా (అడ్డా కూలీలుగా) జీవితాలు వెళ్లదీస్తున్నారు.

**పేదరికం కుమ్మర వృత్తి..**

జీవనోపాధి లేక దారిద్ర్య రేఖ కింద జీవిస్తూ కనీస అవసరాలు తీర్చుకోని దుస్థితిలో వున్నారు. విద్య, వైద్యం, పక్కా గృహ వసతి లేక నిరుద్యోగం, నిరక్షరాస్యత, ఆకలి చావులు, అల్ప పౌష్టికాహారం, అప్పుల బాధలు కుమ్మర వృత్తిదారుల పాలిట శాపాలుగా మారాయి. ప్రభుత్వాలు కుమ్మర వృత్తిదారుల సంక్షేమానికి, ఆర్థిక వికాసానికి సమగ్రమైన పథకాలు అమలు చేయకపోవటం వల్ల కుమ్మర వృత్తి దారుల సాంఘిక, ఆర్థిక వికాసం సామాజిక వికాసం ఎండమావిగా మారటం శోచనీయం. ప్రభుత్వాలు ఇతర కుల వృత్తులను అన్ని రకాలుగా ఆదుకుంటున్న విధంగా కుమ్మ వృత్తిని ఆదుకోవాలి. మానవ నాగరికత ఉపయోగపడే కుమ్మర వృత్తికి పూర్వ వైభవం తేవాలి. ఆధునిక సాంకేతికతను సమాచార రంగంలో వస్తున్న నూతన సాంకేతిక విధానాల పట్ల ఉత్పత్తి పద్ధతుల పట్ల కుమ్మర యువతకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించి కుమ్మర యువతలో శ్రామిక సామర్థ్యం పెంపొందించే ఉత్పత్తి విధానాలకు 'వృత్తి నైపుణ్యాభివృద్ధి' కి పెద్ద పీట వెయ్యాలి.

**మౌలిక వసతులు కల్పించాలి..**

ప్రభుత్వం కుమ్మర వృత్తికి మౌలిక సదుపాయాలు కల్పించాలి. కుండలు కాల్చడానికి, వాము బట్టీలు పెట్టుకోవటానికి స్థలము సమకూర్చాలి. చెరువుల్లో నుండి కుమ్మరి మట్టిని ఉచితంగా తీసుకోవడానికి ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు అమలుకు నోచుకోకపోవడం వల్ల కుమ్మర మట్టిని పొందడంలో కుమ్మర వృత్తి దారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మట్టి సేకరణ తదితర ముడి సరుకులు తమ ఉత్పత్తులకు స్టోరేజ్ వసతి అడవుల నుండి ఉచితంగా కలప, వాము కాల్చడానికి పొరక తీసుకోవడానికి ప్రభుత్వం జారీ చేసిన జీవోలను రెవిన్యూ అటవీ శాఖ అధికారులు అమలు చేసేట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చెయ్యాలి. ప్రభుత్వాలు విధించే సీవరేజ్ సెస్ వృత్తి పన్ను నుండి కుమ్మర వృత్తిని మినహాయించాలి.

చాకలి, మంగలి వృత్తులకు ఇస్తున్న ఉచిత విద్యుత్తు సౌకర్యం కుమ్మర వృత్తిదారులు ఉపయోగించే విద్యుత్తు 'సారెకు' ఇవ్వాలి. కుమ్మర వృత్తిదారులకు షెడ్స్ నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా భూమిని, స్థలాన్ని కేటాయించాలి. గ్రామ పంచాయితీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ నెలకొల్పిన షాపింగ్ కాంప్లక్స్‌ల్లో కుమ్మర వృత్తిదారుల ఉత్పత్తుల అమ్మకానికి ఉచితంగా వసతి కల్పించాలి. రైతు బజారులో కుమ్మర వృత్తి ఉత్పత్తులు అమ్ముకోవడానికి స్థలం కేటాయించాలి. కుమ్మర్ల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి మార్కెట్లో విధించే పన్నుల నుండి మినహాయింపు ఇవ్వాలి.ప్రభుత్వం కుమ్మర్లు సామాజికంగా విద్య, ఉద్యోగ రంగాలలో అభివృద్ధి చెందడానికి విద్య, ఉపాధి రంగాల్లో పోటీని ఎదుర్కోవటానికి కుమ్మర కులాన్ని బిసి 'ఎ' గ్రూపులో చేర్చాలి. కేంద్ర ప్రభుత్వ భవిష్యనిధి పథకం, ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా, సౌకర్యాలు కుమ్మర వృత్తి కార్మికులకు వర్తింపచెయ్యాలి. కుమ్మర వృత్తి కార్మికులకు కార్మిక మంత్రిత్వ శాఖ లేబర్ గుర్తింపు కార్డులు, ఆరోగ్య కార్డులు ఉచితంగా అందించాలి. ఇది వారి ఆవేదన....

కె. గోవింద్ రావు
పిఠాపురం ఇంచార్జ్
పీపుల్స్ మోటివేషన్

## నూతన సబ్ స్టేషన్ కోసం స్థలం పరిశీలించిన తహశీల్దార్



**శ్రీరంగాపూర్ /వనపర్తి, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలో నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం జిల్లెల చిన్నారెడ్డి మరియు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మండల మాజీ జెడ్పీటీసీ రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ఫోన్ ద్వారా ఎలక్ట్రికల్ ఎస్సీ కి %ఉ% మురళీ ఏయి గారితో మాట్లాడగా స్థలాన్ని పరిశీలించడానికి విచ్చేసిన వారిని శ్రీ రంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించిన ఎమ్మార్వో మురళీ , ఏయి ,ఆర్ ఐ రాధాకృష్ణ వారితో పాటు సర్వేయర్ రాజు మండల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థిమండలి పెట్టుబడి వేడుక






**కర్నూలు, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు కేంద్రీయ విద్యాలయంలో ఆగస్టు 9వ తేదీ విద్యార్థిమండలి పెట్టుబడి వేడుక( ఇన్వెస్టిచర్ సెరిమని ) ఘనంగా జరిగింది. కల్నల్ జోబి ఫిలిప్స్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందించి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థులలో నాయకత్వలక్షణాలను పెంపొందించడానికి మరియు ప్రజాస్వామ్య స్ఫూర్తిని నింపడానికి కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని ముఖ్య అతిథి పేర్కొన్నారు. విద్యార్థులు బాధ్యతగల భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ప్రియదర్శని నూతన విద్యార్థిమండలిని అభినందించి, పాఠశాల నిర్వహణలో విద్యార్థి నాయకులు తమ వంతు పాత్ర పోషించాలని ఉద్బోధించారు.ఆజాద్, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ విభాగాల విద్యార్థులు ప్రదర్శించిన కవాతు కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తుషారిక సంధానకర్తగా వ్యవహరించారు. సీనియర్ ఉపాధ్యాయులు ఆంజనేయులు, కోఆర్డినేటర్ రంగన్న, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బాదల్ షోకీన్,వ్యాయామ శిక్షకుడు వజ్రరాజు క్రమశిక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చక్కని ఏర్పాట్లు చేశారు.బ్యాడ్జీల తయారీలో చిత్రలేఖన ఉపాధ్యాయుడు సిరివెళ్ల ప్రగతి కుమార్ ప్రత్యేక చొరవ,శ్రద్ధ కనబరిచారు. కౌన్సిలర్ అహ్మద్ హుస్సేన్ ఇందుకు సహకరించారు.

## మయూర వాహనంపై స్వామి అమ్మవార్లు

మడకశిర : విడపనకల్లు మండలం ఉండబండ వీరభద్రస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా వీరభద్ర స్వామి, కాళికాదేవి మయూర వాహనంపై ఊరేగారు. వేద పండుతుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఈఓ రమేష్బాబు ఆధ్వర్యంలో సుప్రభాతం, అమ్మవార్ల అభిషేకం కుంకుమార్చన, బిల్వార్చన, దేవి హోమం, మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది లీలావతి, పురుషోత్తం, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## ప్రజల సహకారంతో నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టి.జి.భరత్**





**కర్నూలు, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు నగరాన్ని ప్రజల సహకారంతో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 51వ వార్డు లో ఈసిఎం కాంపౌండ్ నందు రూ.50 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి నగరపాలక సంస్థ మేయర్ బి.వై. రామయ్యతో కలసి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టి.జి.భరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ముందు వార్డులో తిరిగిన సమయంలో డ్రైనేజ్ సమస్యలు ఉన్నాయని తెలుసుకున్నట్లు చెప్పారు. వార్డులోని ప్రజల కోరిక మేరకు ఈరోజు 50 లక్షల రూపాయల వ్యయంతో డ్రైనేజి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అమీర్ హైదర్ ఖాన్ నగర్ లో కూడా ఇదే సమస్య ఉన్నట్లు ప్రజలు తెలియజేశారని అందుకొరకు గాను అక్కడ కూడా డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ ను.. మంత్రి ఆదేశించారు. కర్నూల్ నగరాన్ని అంచలవారిగా ప్రణాళిక బద్ధంగా ప్రజల సహకారంతో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు. కర్నూలు నగరంలోని ఓల్డ్ సిటీలో ఎలక్ట్రికల్ వైర్లు కూడా క్రిందికి వ్రేలాడుతున్నాయని.. వీటిని కూడా త్వరలో అధికారులతో మాట్లాడి సరి చేపిస్తామని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ బి.వై. రామయ్య, ఇంచార్జ్ కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్. మున్సిపల్ ఈఈ షాకీర్ హుస్సేన్, ఏఈ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మన కర్నూలు.. నా బాధ్యత కార్యక్రమం చేపట్టిన మంత్రి

**కర్నూలును అభివృద్ధి చేసే బాధ్యత నాది.. రాష్ట్ర మంత్రి టి.జి భరత్**

**15వ వార్డు బుధవారపేటలో పర్యటించి సమస్యలు తెలుసుకున్న టి.జి భరత్**



**కర్నూలు, ఆగస్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలును అభివృద్ధి చేసే బాధ్యత తనదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. శుక్రవారం మన కర్నూలు.. నా బాధ్యత కార్యక్రమం పేరుతో ఆయన 15వ వార్డు బుధవారపేటలో పర్యటించారు. వీధివీధిలో తిరిగి ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజల నుండి తెలుసుకున్న సమస్యలను అధికారులకు చూపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పాటు స్థానికులు డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్ వైర్లు, మరుగుదొడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్, త్రాగునీటి పైపులైన్ల సమస్యలు పరిష్కరించేందుకు ఏ విధంగా ముందుకెళ్లాలో ప్రణాళిక తయారుచేయాలని అధికారులకు చెప్పారు. ప్రజలతో మమేకమై వారి ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. పింఛన్లు లేని వారందరికీ త్వరలోనే మంజూరు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా విధానం తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శివమ్మ, పరమేష్, మున్సిపల్ అధికారులు, మాజీ కార్పొరేటర్లు పామన్న, అబ్బాస్, రామాంజనేయులు, మహిళా నాయకురాలు ముంతాజ్ బేగం, నాయకులు జేమ్స్, రవి, బూత్ ఇంఛార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే నెం.1 క్రిమినల్ లీడర్ వైఎస్ జగన్





**సిబిఐ కోర్టుకు వెళ్లకుండా ఉండేందుకే ప్రతి శుక్రవారం ఒక కార్యక్రమం**

**వైఎస్ జగన్‌పై మంత్రులు, ఎం పి, ఎమ్మెల్యేల ఆగ్రహం**

**నంద్యాల, ఆగష్టు 09 (పీపుల్స్ మోటివేషన్):-**

దేశంలోనే నెం.1 క్రిమినల్ లీడర్ వైఎస్ జగన్ అని నేషనల్ మీడియా చెప్తోందని, సిబిఐ కోర్టుకు వెళ్లకుండా ఉండేందుకే ప్రతి శుక్రవారం ఏదో ఒక కార్యక్రమాన్ని జగన్ ఏర్పాటు చేసుకుంటున్నాడని రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బిసి జనార్ధన్ రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి , ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్ రెడ్డి , గిత్త జయసూర్య , టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌లు విమర్శించారు. శుక్రవారం నంద్యాల టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి , ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ , బుడ్డా రాజశేఖర్ రెడ్డి , గిత్త జయసూర్య జగన్ పై విరుచుకుపడ్డారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలకు, హత్యా రాజకీయాలకు దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు క్లియర్‌గా చెప్పారన్నారు. జగన్ ఇకనైనా హత్యా రాజకీయాలపై మాట్లాడటం మానుకొవాలని, రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడితే బాగుంటుందని మంత్రి ఫరూక్ హితవు చెప్పారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉన్నాయన్నారు. జగన్ పాలనలో 2,686 హత్యలు జరిగాయని, ఆయనపై కూడా కేసులు పెట్టాలన్నారు. 'మీ కుటుంబ చరిత్ర అంతా రక్త చరిత్రే' అని జగన్‌పై మంత్రి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సీతారామాపురంలో రెండు పార్టీల మధ్య గొడవ జరగలేదని, రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగిందన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ జగన్ మాట్లాడుతుంటే దయలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని, బాబాయ్ హత్య జరిగినా రక్త చరిత్ర అని టిడిపి పై ఆరోపించారని, బాబు, లోకేష్ ను విమర్శించే హక్కు జగన్ కు లేదన్నారు. డాక్టర్ సుధాకర్, అబ్దుల్ సలాం కుటుంబం చనిపోతే ఎందుకు రాలేదని నిలదీశారు. మాటకు రెడ్ బుక్ ఒకటే కనిపిస్తుంది, ఇంకా రెడ్ బుక్ తెరవలేదని ఎంపి బైరెడ్డి శబరి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ వల్లే మర్డర్ జరిగిందన్నారు. జగన్ ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు. నంద్యాలలో కానిస్టేబుల్ సురేంద్ర మర్డర్, అబ్దుల్ సలాం సూసైడ్ ఘటనలు జరిగినప్పుడు జగన్ నంద్యాలకు ఎందుకు రాలేదు? అని అఖిలప్రియ ప్రశ్నించారు. నంద్యాల శిల్పా వెంచర్‌లో ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసి హత్య చేస్తే జగన్ ఎందుకు స్పందించలేదన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జగన్ చుట్టూ ఉన్న నాయకులు మైండ్ క్రిమినల్ మైండ్ అని శవ రాజకీయాలు చేయడంలో వారికి సాటి ఎవరూ లేరని వారి పార్టీ పుట్టిందే శవ రాజకీయాల పైన అని వైఎస్ఆర్సిపి నాయకులపై విరుచుకుపడ్డాడు. ఎవరికీ భయపడే ప్రసక్తి లేదని ఇక్కడ ఉండేది బుడ్డా రాజశేఖర్ రెడ్డి అని హెచ్చరించారు . మా కుటుంబం రాజకీయాల్లో 50 సంవత్సరాల నుంచి ఉందని ఏ విషయం చర్చించడానికి అయినా మేము రెడీ అని సవాలు విసిరారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గీతా జయసూర్య మాట్లాడుతూ రాజకీయాలు అంటే హుందాగా చేయాలే తప్ప ఇలా శవ రాజకీయాలు చేయకూడదని భవిష్యత్తులో జగన్ అరాచకాలని బయటకు తీస్తామని వారు వెంట తిరిగే నాయకులు ఎవరైతే తప్పు చేసి ఉంటారో వారిని కచ్చితంగా చట్టం శిక్షిస్తుందని తెలియజేశారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైఖానస ఆగమం ప్రకారమే శ్రీవారి పూజా విధానం

**కశ్యప మహర్షి తిరునక్షత్రోత్సవంలో పండితుల వెల్లడి**

**తిరుమల,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్) :**

తిరుమల వేంకటేశ్వర స్వామివారి ఆరాధన విధానానికి వైఖానస మహర్షి రచించిన వైఖానస భగవత్ శాస్త్రం మూలమని పండితులు పేర్కొన్నారు. తిరుమల ఆస్థాన మండపంలో వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ, టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం కశ్యప మహర్షి తిరు నక్షత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైఖానస సభ కార్యదర్శి శ్రీనివాస దీక్షితులు, వైఖానస ట్రస్టు కార్యదర్శి ప్రభాకరాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానిక దృక్పథంతో శాస్త్రాధ్యయనం చేసి సమాజానికి సేవచేయాలన్నారు. ఆలయ సంస్కృతికి(ువఎజూశ్రీవ అబీశ్రీబిబీతీవ) ఆధారమైన ఆగమశాస్త్రాల పరిరక్షణ సమాజం బాధ్యతగా స్వీకరించాలని కోరారు. జ్ఞానాన్ని అందించిన మహర్షుల జయంతులను పండుగలుగా జరుపుకుంటూ, ఆలయ సాంప్రదాయాలు పాటిస్తూ, భగవద్దర్శనంతో ప్రశాంత జీవనం పొందాలని సూచించారు.వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధినీ సభ అధ్యక్షులు రాఘవ దీక్షితులు మాట్లాడుతూ విఖనస మహర్షి, భృగు, అత్రి, మరీచి, కశ్యప మహర్షుల జ్ఞాన ఫలాలు నేటికీ సమాజాన్ని ధర్మమార్గంలో పయనింపజేస్తూ, సమాజాన్ని ఆలయ వ్యవస్థతో అనుసంధానం గావించిందని చెప్పారు. మానవాళిని మహోన్నత స్థితికి చేర్చే ఆరాధనా విధానం కశ్యప మహర్షి జ్ఞానకాండ గ్రంథంలో వివరించారని తెలిపారు. ఈ సభలో వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం ఆచార్యులు, ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం అధ్యాపకులు, పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హత్యా రాజకీయాలపై జగన్ వ్యాఖ్యలు

**దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది**

**మండిపడ్డ మంత్రులు జనార్ధన్ రెడ్డి, ఫరూక్**

**అమరావతి,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఏపీ మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ఆరోపించారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. ఇటీవల నంద్యాల జిల్లా సీతారామపురంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ఒకరు చనిపోతే ఉనికి కోసం హత్యను రాజకీయాలకు వాడుకుంటున్నారని జగన్ పై మండిపడ్డారు.చంద్రబాబుపై కేసు పెట్టాలని జగన్ డిమాండ్ చేయడం శోచనీయమని ఆరోపించారు. వైసీపీ పాలనలో 2,686 హత్యలు జరిగాయని, ఆయనపై కూడా కేసులు పెట్టాలని పేర్కొన్నారు. జగన్ కుటుంబ చరిత్ర అంతా రక్త చరిత్రేనని విమర్శించారు. వైఎస్ వివేకానందా రెడ్డి హత్యను ప్రశ్నిస్తున్న మీ చెల్లెలు సునితా రెడ్డికి సమాదానం చెప్పాలన్నారు. భారతదేశంలోనే వైఎస్ జగన్ లాంటి క్రిమినల్ లీడర్ లేరని జాతీయ మీడియా సంస్థ పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. సీబీఐ కోర్టుకు వెళ్లకుండా ప్రతి శుక్రవారం ఏదో ఒక కార్యక్రమం అంటూ తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడు కూడా హత్య రాజకీయాలను ప్రోత్సహించరని స్పష్టం చేశారు. ఇకనైనా హత్యా రాజకీయాలపై మాట్లాడటం మానుకొవాలని మంత్రులు జగన్‌కు సూచించారు. నంద్యాలలో కానిస్టేబుల్ సురేంద్ర మర్డర్, అబ్దుల్ సలాం సూసైడ్ ఘటనలు జరిగినప్పుడు జగన్ నంద్యాలకు ఎందుకు రాలేదు? అని ఎమ్మెల్యే అఖిల ప్రియ ప్రశ్నించారు.

## 15న రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సృజన**




**విజయవాడ,ఆగస్ట్9(పీపుల్స్ మోటివేషన్) :**

నిరుపేదలకు తక్కువ ధరకే భోజనాన్ని అందించే అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధికారులను ఆదేశించారు.ఈనెల 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను లాంచనంగా ప్రారంభించనున్న దృష్ట్యా నగరంలో ప్రారంభించే అన్న క్యాంటీన్ల నిర్వహణ పనులను రేపటికల్ల పూర్తి చేసి సిద్ధం చేయాలన్నారు. దీనిలో భాగంగా వన్‌టౌన్ గాంధీ పార్కు వద్ద, అలంకార్ ధర్నాచౌక్ వద్ద అన్న క్యాంటీన్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. జి. సృజన నగరపాలక సంస్థ కమీషనర్ హెచ్ యం ధ్యాన చంద్ర, ఆర్‌డివో బిహెచ్ భవానీ శంకర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదలకు నాణ్యమైన ఆహారాన్ని ఐదు రూపాయలకు అందించనున్నారన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టే ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నామన్నారు. క్యాలిటీ, క్యాంటిటీ విషయంలో రాజీ పడకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా సిద్ధం చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం మూడుపూటలా అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు 15 రూపాయలకే లభ్యం కానున్నదన్నారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధం చేయాలని కలెక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

శనివారం । ఆగస్టు । 10 । 2024



# రెజ్లింగ్‌కు వినేశ గుడ్‌బై



భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ 50కిలోల విభాగం ఫైనల్ పోటీకి ముందు అదనపు బరువు ఆమె పతక ఆశలను దెబ్బతీసింది. దీంతో మనస్తాపానికి గురైన ఫోగాట్ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ఎక్స్(ట్విటర్)లో గురువారం పోస్ట్ చేసింది. 'రెజ్లింగ్ నాపై గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించు. నాకు ఇంకా పోరాడే బలం లేదు' అని పేర్కొంది. 'రెజ్లింగ్ 2001–2024 గుడ్‌బై' అంటూ ట్వీట్ చేసింది. పారిస్ ఒలింపిక్స్ 50కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్..నిర్దేశిత బరువు కంటే 100 గ్రాములు అధికంగా ఉండటంతో అనర్హతకు గురైంది. దీనిపై సవాల్ చేస్తూ ఫోగాట్ 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్'ను ఆశ్రయించింది. తాను రజత పతకానికి అర్హురాలినని ఆ ఫిర్యాదులో పేర్కొంది. తాజాగా వినేశ్ చేసిన అపీల్ సరైనదేనంటూ 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్' పేర్కొనడంతో ఆమెకు ఒలింపిక్స్‌లో పతకంపై ఆశలు చిగురించాయి. ఈలోపే ఆమె అనూహ్యంగా వీడ్కోలు ప్రకటించింది. గత రెండు ఒలింపిక్స్‌లతో పోల్చిచూస్తే పారిస్‌లో వినేశ్‌కు చేదు అనుభవమే ఎదురైంది. రియో ఒలింపిక్స్‌లో ఆమె కాలు విరిగితే.. టోక్యో ఒలింపిక్స్‌లో 53కిలోల విభాగంలో క్వార్టర్‌ఫైనల్లోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఓవైపు అయితే తనపై వస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం చెప్పేందుకు బౌట్‌లో శక్తికి మించి పోరాడిన వినేశ్.. పారిస్‌లో పతకమే లక్ష్యంగా పోటీకి దిగింది. తన రెగ్యులర్ విభాగం 53 కిలోలు కాకుండా ఈసారి 50కిలోల కేటగిరీ ఎంచుకున్న ఫోగాట్‌కు యు సుసాకీ(జపాన్) రూపంలో టాప్‌సీడ్ క్రీడాకారిణి ఎదురైనా వెరువకుండా పోరాడి సంచలన విజయం సాధించింది. అదే జోరులో క్వార్టర్స్, సెమీస్ బౌట్లలో ప్రత్యర్థులను చిత్తుచేసి ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా నిలిచింది.

## చరిత్ర ఎరుగని వీరుడు..




పారిస్ ఒలంపిక్స్ లో భాగంగా అన్ని దేశాలు బంగారు పథకాలను గెలుచుకుంటూ ముందుకు సాగుతూ ఉంటే.. ఇప్పటివరకు ఇండియా మాత్రం కేవలం కాంస్య పథకాలతో మాత్రమే సరిపెట్టుకుంది అన్న విషయం తెలిసిందే. ఎంతో మంది అథ్లేట్లు పథకాలు సాధిస్తున్న.. అవి కేవలం కాశ్య పథకాలకు మాత్రమే పరిమితం అవుతూ ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈసారి బంగారు పతకం వస్తే బాగుండు అని ఇండియాలోని ప్రతి ఒక్కరు కూడా ఆశలు పెట్టుకున్నారు. ఇలాంటి సమయంలోనే అటు స్టార్ రెజ్లర్ వినేష్ పొగాట్ బంగారు పతకం పై ఆశలు కలిగించింది. సెమీఫైనల్ మ్యాచ్లో ప్రపంచ నెంబర్ వన్ ను ఓడించి ఫైనల్ లో అడుగుపెట్టింది. దీంతో తప్పకుండా భారత్కు అటు స్వర్ణం వరిస్తుంది అని వినేష్ పొగట్ చరిత్ర సృష్టిస్తుంది అని అందరూ అనుకున్నారు. కానీ దురదృష్టవశాత్తు 100 గ్రాములు అధికంగా ఉండటం కారణంగా వినేష్ పొగట్ పై అనర్హత వేటు పడింది అని చెప్పాలి. ఇక ఆ తర్వాత అందరి ఆశలు ఒక్కడి పైకి వెళ్ళిపోయాయి. అతనే 2021 ఆగస్టు ఏడవ తేదీన ఒలంపిక్స్ లో ఇండియాకి స్వర్ణ పథకాన్ని అందించిన తొలి వీరుడు నీరజ్ చోప్రాపై. అప్పటివరకు భారతకు అసలు స్వర్ణ పథకమే లేదు. కలలో కూడా పసిడి ఊహ ఉండేది కాదు. కానీ ఆరోజు ఓ వీరుడు వచ్చాడు. బల్లెం పట్టుకుని పరుగెందుకున్నాడు. ఇక మెరుపు వేగంతో త్రో వేసి ఇక శతాబ్ద కాల స్వప్నాన్ని సహకారం చేశాడు. ఏకంగా ఒలంపిక్స్ లో బంగారు పతకాన్ని అందించి.. 130 కోట్ల భారతీయుల కలను నెరవేర్చాడు. అయితే ఇక ఇప్పుడు పారిస్ ఒలంపిక్స్ లో కూడా అతనిపైనే అందరు ఆశలు పెట్టుకున్నారు. అనుకున్నట్టుగానే ఫైనల్ చేరాడు. అయితే ఫైనల్ లో మాత్రం చివరికి రెండో స్థానంలో నిలిచి అటు సిల్వర్ మెడల్ తో సరిపెట్టుకున్నాడు. వరుసగా రెండు ఒలంపిక్స్ లలో రెండు పథకాలు గెలిచి చరిత్ర సృష్టించాడు. భారత క్రీడా ప్రపంచం ఎరుగని సరికొత్త వీరుడు ఇప్పుడు సిల్వర్ మెడల్ గెలిచి మరోసారి తనను తాను ఈ క్రీడా ప్రపంచానికి పరిచయం చేసుకున్నాడు.

## సెమీస్‌కు చేరిన అమన్..

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం ఖాయం అయింది. ఇండియన్ యంగ్ రెజ్లర్ అమన్ సెహ్రావత్ అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతున్నాడు. గురువారం పురుషుల 57 కేజీల క్వార్టర్ ఫైనల్ జరిగింది. ఈ మ్యాచ్‌లో అమన్ సెహ్రావత్ 12–0 తేడాతో విజయం సాధించాడు. అల్బేనియా ఆటగాడు జెలిమ్ ఖాన్ అబాకనోవ్‌పై నెగ్గాడు. దీంతో సెమీ ఫైనల్ లోకి అమన్ చేరిపోయాడు. ఫైనల్‌లో జపాన్‌కు చెందిన రీహిగుచితో అమన్ పోటీపడనున్నాడు. జపనీస్‌పై విన్ అయితే అమన్‌కు రజత పతకం రానుంది. ఒకవేళ ఓడితే మాత్రం బ్రాంజ్ మెడల్ కోసం పోటీ పడాల్సి ఉంటుంది. హర్యానాలోని ఝుజ్జర్‌కు చెందిన అమన్ బీరోహార్ ప్రాంతానికి చెందిన ఓ యువ రెజ్లర్. 21 ఏళ్లలోనే ఇంటర్నేషనల్ లెవల్లో దూసుకుపోయి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాడు. ప్రపంచ వ్యాప్తంగా అనేక మ్యాచులు ఆడి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం పారిస్ ఒలింపిక్స్‌లో అమన్ రెజ్లింగ్ 57 కేజీల విభాగంలో బరిలో ఉన్నాడు. కెరీర్ పరంగా చూస్తే.. 2022 ఆసియా క్రీడల్లో అమన్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అలాగే 2023లో కజకిస్తాన్ లోని అస్తానాలో ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అమన్ గోల్డ్ మెడల్ సాధించాడు. అమన్ తన జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. జాట్ కుటుంబానికి చెందిన అమన్ తన పదేళ్ల వయస్సులో తల్లిని పోగొట్టుకున్నాడు. ఏడాది తర్వాత తండ్రి కూడా మరణించాడు. చెల్లెలు పూజా సెహ్రావత్‌తో పాటు మేనమామ సుధీర్ సెహ్రావత్ ఇంటికి చేరాడు. ఆ తర్వాత రెజ్లింగ్‌పై మక్కువ పెంచుకున్న అమన్.. కోచ్ లలిత్ కుమార్ వద్ద ట్రైనింగ్ తీసుకున్నాడు. 2021లో తొలిసారి జాతీయ ఛాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గాడు. 2024లో జాగ్రెబ్ ఓపెన్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో అమన్ గోల్డ్ మెడల్ గెలుచుకున్నాడు. పారిస్ 2024 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఒకేఒక్క భారత పురుష రెజ్లర్‌గా నిలవడం విశేషం. అమన్ సెమీస్‌కు చేరడంతో ఇండియాకు మరో మెడల్ ఖాయమని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## సంచలన ప్రకటన చేసిన రోహిత్ శర్మ

టీమిండియా టి20 వరల్డ్ కప్ గెలిచింది. ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఏడు పరుగుల తేడాతో మట్టికరిపించింది. అదే జోరులో యువభారత్ జట్టు జింబాబ్వేలో పర్యటించింది. ఐదు టి 20 మ్యాచ్ల సిరీస్ ను 4–1 తేడాతో దక్కించుకుంది. అనంతరం శ్రీలంక లో పర్యటించింది. సూర్య కుమార్ యాదవ్ సారథ్యంలో 3 %%20 మ్యాచ్ల సీరీస్ ను 3–0 తేడాతో సొంతం చేసుకుంది. అయితే ఇదే జోరును టీమిండియా రోహిత్ నాయకత్వంలో చూపిస్తుందని.. వన్డే సిరీస్ అదరగొడుతుందని అభిమానులు ఆశించారు. పైగా జట్టుకూర్పులో కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ తనదైన మార్క్ చూపించాడు. దీంతో వన్డే సిరీస్ లో కూడా టీమిండియా కు గెలుపు నల్లేరు మీద నడకని అందరూ అనుకున్నారు. కానీ జరిగింది వేరు.. తొలి వన్డే టీమిండియా బ్యాటర్ల నిర్లక్ష్యం వల్ల టై అయింది. రెండవ వన్డే మిడిల్ ఆర్డర్ వైఫల్యం వల్ల ఓడిపోవాల్సి వచ్చింది. మూడో వన్డేలో ఆటగాళ్ల నిర్లక్ష్యం వల్ల సిరీస్ కోల్పోవలసి వచ్చింది.. దీంతో టీమిండియా ఆటగాళ్లపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జట్టుకూర్పు సరిగ్గా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో జట్టు సిరీస్ కోల్పోవడం పట్ల కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి. టీమిండియా వన్డే సిరీస్ కోల్పోయిన తర్వాత రోహిత్ శర్మ విలేకరుల సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.. ఈ క్రమంలో ఓటమికి దారి తీసిన పరిస్థితులను వెల్లడించాడు.. స్లో పిచ్, స్పిన్ బౌలింగ్, బ్యాటర్లలో సమన్వయం లేకపోవడం వంటివి ఓటమికి కారణమయ్యాయని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో టి20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారత్ ఆత్మ సంతృప్తి చెందిందా? అని విలేకరులు ప్రశ్నించగా.. దానికి రోహిత్ స్పందించాడు.." భారత్ తరఫున ఆడుతున్నప్పుడు అలాంటి మాటకు తావులేదు. నేను నాయకత్వం వహిస్తున్నంతవరకు అలాంటి దానికి అవకాశం ఇవ్వను. దేశం కోసం ఆడడాన్ని నేను గొప్పగా భావిస్తా. దేశం కోసం ఏదైనా చేయడానికి సిద్ధపడతాను. అలాంటప్పుడు ఓటమి అనే పదానికి తావులేదు. సంతృప్తి అనే మాటకు అర్థం లేదు. వన్డే, టి20 లలో నెంబర్ వన్ స్థానంలో ఉన్నాం. టెస్టులలో రెండవ స్థానానికి వచ్చాం. మొదటి స్థానానికి వచ్చిన తర్వాత సంతృప్తి చెందితే అక్కడితోనే ఆగిపోవలసి ఉంటుంది. ఆ తర్వాత మన స్థానాన్ని ఇంకొకరు భర్తీ చేస్తారు. అలాంటి అవకాశం ఇస్తే మనం విఫలమైనట్టు లెక్క. అందుకే అలాంటి వాటికి నేను చోటు ఇవ్వను. శ్రీలంక మాకంటే మెరుగ్గా ఆడింది. స్పిన్ బౌలింగ్ ను ఎదుర్కోవడంలో మా బ్యాటర్లు విఫలమయ్యారు. మాలో లోపాలను సమీక్షించుకుంటాం. కచ్చితంగా బౌన్స్ బ్యాక్ అన్నట్టుగా మళ్లీ విజృంభిస్తాం. ఈ సిరీస్ మీకు కోల్పోయినంత మాత్రాన ప్రపంచం అంత మైనట్టు కాదు. దీని తర్వాత ఎలా మేము పుంజుకోవాలి అనే విషయంపై ఖచ్చితంగా ఆత్మ పరిశీలన చేసుకుంటామని" రోహిత్ వ్యాఖ్యానించాడు.

## అత్యంత ధనిక హాకీ క్రీడాకారులలో ఒకడిగా హర్మన్‌ప్రీత్ సింగ్..!



పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు చరిత్ర సృష్టించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా 2–1తో స్పెయిన్‌ను ఓడించి ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఇంతకు ముందు టోక్యో ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. ఒలింపిక్ పురుషుల హాకీలో భారత్‌కు ఇది 13వ పతకం కాగా.. 52 ఏళ్ల తర్వాత వరుసగా రెండో పతకం గెలిచి మరోసారి చరిత్ర సృష్టించింది. టీమిండియా సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ ప్రపంచంలోని అత్యుత్తమ డ్రాగ్ ఫ్లికర్స్‌గా పరిగణించబడ్డాడు. ప్రజలు అతన్ని సర్పంచ్ సాహెబ్ అని కూడా పిలుస్తారు. అతను భారతదేశంలోని అత్యంత ధనిక హాకీ ప్లేయర్లలో ఒకడిగా ఉన్నాడు. హర్మన్‌ప్రీత్ సింగ్ సంపాదన గురించి తెలుసుకుందాం. హర్మన్‌ప్రీత్ సింగ్ భారతదేశంలోని అత్యంత ధనిక హాకీ క్రీడాకారులలో ఒకరని అంచనా వేశారు. అతని నికర విలువ %వి%50 లక్షల (సుమారు రూ. 42 కోట్లు) అని మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. ఇది అతనికి మూడో ఒలింపిక్స్. 2015లో జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సింగ్ భారత్ తరఫున సీనియర్ అరంగేట్రం చేశాడు. దీని తర్వాత.. అతను 2016 రియో ??ఒలింపిక్స్‌లో కూడా దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. 2022–2023 ప్రో లీగ్ సీజన్‌కు ముందు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. హర్మన్‌ప్రీత్ సింగ్ సంపద ప్రధానంగా అతని అంతర్జాతీయ హాకీ కెరీర్, హాకీ ఇండియా లీగ్‌లో పాల్గొనడం ద్వారా వచ్చింది. 2015 లీగ్ సీజన్‌లో అతన్ని దబాంగ్ ముంబై %వి%51,000 (సుమారు రూ. 42 లక్షలు)కి కొనుగోలు చేసింది. సింగ్ ఐదు గోల్స్ చేసి తనదైన ముద్ర వేశాడు. టోర్నమెంట్‌లో 'మోస్ట్ ప్రామిసింగ్ ప్లేయర్' అయినందుకు అతనికి 2015 పాంటీ చద్దా అవార్డు లభించింది.

## భారత హాకీ జట్టు సంచలనం..



రెజ్లింగ్ పోటీ ఫైనల్స్ లో వినేశ్ ఫొగాట్ బరువు సమస్య వల్ల పోటీ పడలేకపోయింది. చివరికి మెడల్ సాధించకుండానే నిరాశతో వెను తిరిగింది. దీంతో నిన్నటి నుంచి దేశవ్యాప్తంగా ఒకటే చర్చ మొదలైంది. అటు మీడియాలో తామరతంపరగా కథనాలు ప్రసారమవుతున్నాయి. సోషల్ మీడియాలో లక్షలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో నిరాశలో ఉన్న భారత్ కు గుడ్ న్యూస్ చెప్పింది హాకీ జట్టు. గురువారం జరిగిన కాంస్య పతక పోరులో 2–1 తేడాతో స్పెయిన్ పై విజయాన్ని సాధించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ (మ్యాచ్ 30, 33వ నిమిషాలలో) రెండు గోల్స్ చేసి.. భారత జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. ఫలితంగా ఒలింపిక్స్ లో భారత్ సాధించిన మెడల్స్ సంఖ్య నాలుగు కు చేరుకొంది. ఈ మ్యాచ్ లో తొలి క్వార్టర్స్ లో రెండు జట్లు ఒక్క గోల్ కూడా చేయలేకపోయాయి. ఈ క్రమంలో రెండవ క్వార్టర్ ప్రారంభంలో (ఆట 18వ నిమిషం) స్పెయిన్ ప్లేయర్ మిరల్లెస్ పెనాల్టీ స్ట్రోక్ ను అత్యంత చాకచక్యంగా గోల్ గా మలిచాడు. దీంతో స్పెయిన్ లీడ్ లోకి వెళ్ళింది. ఆట 29వ నిమిషంలో భారత జట్టుకు పెనాల్టీ కార్నర్ లభించింది. దానిని హర్మన్ ప్రీత్ గోల్ చేసేందుకు ప్రయత్నించాడు. అయితే దానిని స్పెయిన్ గోల్ కీపర్ సమర్ధవంతంగా అడ్డుకున్నాడు. ఇదే సమయంలో మరో పెనాల్టీ కార్నర్ భారత జట్టుకు లభించింది. అయితే ఈసారి ఎలాంటి పొరపాటుకు తావు ఇవ్వకుండా గోల్ చేసింది. హర్మన్ ప్రీత్ తిరుగులేని షాట్ కొట్టడంతో బంతి గోల్డ్ పోస్ట్ లోకి దూసుకెళ్లింది. దీంతో 1–1 తో స్కోర్ లు సమం అయ్యాయి. ఈ క్రమంలోనే మూడో క్వార్టర్ లో భారత జట్టుకు మరో పెనాల్టీ కార్నర్ లభించింది. దీనిని హార్మన్ ప్రీత్ గోల్ గా మలిచాడు. ఫలితంగా భారత్ 2–1 లీడ్ లోకి వెళ్ళింది. ఆ తర్వాత మూడు పెనాల్టీ కార్నర్లు పొందిన భారత్.. వాటిని గోల్స్ చేయలేకపోయింది. మరో నిమిషంలో మ్యాచ్ ముగుస్తుందనగా స్పెయిన్ కు పెనాల్టీ కార్నర్ దక్కింది. భారత్ దాన్ని అత్యంత చాకచక్యంగా అడ్డుకుంది. ఇక భారత జట్టు 52 సంవత్సరాల అనంతరం ఒలింపిక్స్ లో వరుసగా 2 కాంస్య పతకాలు సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్ లోనూ భారత్ కాంస్యం దక్కించుకుంది. అంతకుముందు 1968, 1972 లో కంచు పతకాలు సాధించింది.

## గంభీర్‌ని ఒక ఆటాడేసుకుంటున్న నెటిజన్లు..



శ్రీలంక క్రికెట్ జట్టు, భారత క్రికెట్ జట్టును 110 పరుగుల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్ కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగింది. శ్రీలంక టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. వారు మొదట బ్యాటింగ్ చేసి 248 పరుగులు చేశారు. భారత్ మంచి ప్రారంభం చేసినా, చివరకు వారి ఇన్నింగ్స్ పతనమైంది. శ్రీలంక టీమ్ బౌలర్ దనుష్ వెల్లాలాజ భారత జట్టు బ్యాట్స్‌మెన్‌లను చాలా తేలికగా ఔట్ చేశాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ లాంటి ముఖ్యమైన ఆటగాళ్లను వెంటనే పెవిలియన్‌కు పంపించేశాడు. దీంతో భారత జట్టు కేవలం 26.1 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైపోయింది. శ్రీలంక 1997 తర్వాత మొదటిసారిగా భారత జట్టును ఓడించింది. అంటే 27 ఏళ్ల తర్వాత శ్రీలంక చేతిలో ఇండియా ఘోరంగా ఓడిపోయింది. ఈ ఓటమికి ఏం టీమ్ ఇండియా కారణం కాదు దానికి హెడ్ కోచ్ కదా వ్యవహరించిన గంభీరే కారణం. ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అనవసరంగా ప్రయోగాలు చేసి ఈ ఓటమికి గంభీర్ కారణమయ్యాడు. అందుకే క్రికెట్ ప్రేమికులు భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్‌ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. కొంతమంది "ఇప్పుడు గౌతమ్ గంభీర్ యుగం ప్రారంభమైంది" అని కూడా వ్యాఖ్యానించారు. అంటే భారత జట్టు ఇప్పుడు తరచూ ఓడిపోతుందని వారు అనుకుంటున్నారు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో క్రికెట్ ఆడడం చాలా కష్టం అని అందరూ అనుకుంటారు. కానీ భారత జట్టు ఇప్పుడు శ్రీలంకలో ఓడిపోయింది. అదంతా కూడా గౌతమ్ గంభీర్‌ను చలవేనని క్రికెట్ ఫ్యాన్స్ అతడిని విమర్శిస్తున్నారు. వ్యంగ్యంగా గంభీర్ పై సెటైర్లు పేల్చుతున్నారు. మరి హెడ్ క్యాచ్ బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజులకే ఎంత పెద్ద అవమానకరం ఓటమిని చవిచూసిన గంభీర్ అనవసరమైన ప్రయోగాలకు పోతాడా లేదంటే గెలుపు కోసమే ప్రయత్నిస్తాడా అనేది తెలియాల్సి ఉంది. రాహుల్ ద్రవిడ్ అనుకోవచ్చుగా ఉన్నప్పుడు వరల్డ్ కప్ సాధించి పెట్టారు. మరి గంభీర్ అలాంటిది ఏదైనా చెప్పు తగిన ఘనత సాధిస్తారని చూడాలి.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## ఎన్టీఆర్.ప్రశాంత్ నీల్ కాంబినేషన్

### పూజా కార్యక్రమలతో ప్రారంభం

జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో 'ఎన్టీఆర్31'




శుక్రవారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇరు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో సక్సెస్ రేస్‌లో ఉన్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌తో సినిమాను ప్రకటించి చాలాకాలమైంది. తారక్ ఆర్ఆర్ఆర్, తదుపరి దేవర చిత్రాలతో బిజీగా ఉండటం, నీల్ సలార్ షూటింగ్‌తో బిజీగా ఉండటంతో సినిమా ప్రారంభం డిలే అయింది. వీరిద్దరి కాంబినేషన్ లో సినిమా కోసం అభిమానులు ఎంతో ఆతురతగా ఎదురు చూస్తున్నారు. 2026 జనవరి 9 ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని చిత్ర బృందం తెలిపింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని అందరూ ఓ యాక్షన్ సినిమాలా భావిస్తారని నేను ముందే ఊహించాను. కానీ నేను నా జానర్‌లోకి వెళ్లాలనుకోవట్లేదు. నిజానికిది భిన్నమైన భావోద్వేగాలతో వైవిధ్యభరితంగా ఉండే చిత్రంగా ఉంటుంది. నాకిది చాలా కొత్త కథ' అని అన్నారు. 'ఎన్టీఆర్31' వర్కింగ్ టైటిల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పేరు ఖరారు చేసినట్లు వార్తలు వినిపించాయి. అయితే టైటిల్ ఏంటనేది ఇంకా వెల్లడించలేదు. ఈ చిత్రాన్ని కూడా ప్రశాంత రెండు భాగాలుగా తెరకెక్కిస్తారని టాక్ నడుస్తోంది.

## మొహమంతా రక్తంతో నటి అనసూయ

టాలీవుడ్ అనసూయ యాంకర్‌గా కెరీర్ మొదలెట్టి ఏకంగా స్టార్ నటిగా ఎదిగింది. పుష్ప, రంగస్థలం లాంటి సినిమాలతో ఎక్కడా లేని క్రేజ్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం పుష్ప-2లోనూ నటిస్తోన్న అనసూయ.. తాజాగా మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం సింబా. ఈ మూవీ ఇవాళ థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన స్టిల్స్‌ను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. మురళీ మనోహర్ దర్శకత్వం వహించిన సింబాలో అనసూయ ప్రధాన పాత్రలో నటించింది. ఈ మూవీలో తన పాత్రకు సంబంధించిన ఫోటోలను తాజాగా ఇన్‌స్టాలో షేర్ చేసింది. మొహమంతా రక్తంతో తడిసి ఉన్న ఫోటోలు చూసి ఆడియన్స్ షాక్‌కు గురి అవుతున్నారు. అయితే ఈ పిక్స్ కేవలం సింబా చిత్రంలో స్టిల్స్ మాత్రమేనని.. సింబా ది ఫారెస్ట్ మ్యాన్ అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. పర్యావరణాన్ని మనం ఎలా కలుషితం చేస్తున్నామో... దానివల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో అనే కథాంశంతో ఈ మూవీని తెరకెక్కించారు. ఇవాళ థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమా చూశాక కనీసం ఒక్కరిలో మార్పు వచ్చినా సంతోషమే అని గతంలో అనసూయ అన్నారు. ఇందులో జగపతిబాబు కీలక పాత్రలో కనిపించారు.



## నేను ఒంటరినని చెప్పలేదే: కీర్తిసురేశ్

కెరీర్ ఆరంభంలో తాను ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని నటి కీర్తి సురేశ్ తెలిపారు. తాను నటించిన చాలా సినిమాలు బాక్సాఫీస్ వద్ద పరాజయం పొందాయని.. దాంతో చాలామంది తనని విపరీతంగా విమర్శించారని ఆమె చెప్పారు. వారి మాటల వల్ల కొన్ని సందర్భాల్లో తాను ఎంతో బాధపడ్డానని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. అంతేకాకుండా తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి మాట్లాడుతూ తాను సింగిల్ కాదని తెలిపారు.వర్క్ లైఫ్ విషయంలో చాలా సంతోషంగా ఉన్నా. మనసుకు నచ్చిన చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నా. కెరీర్ ఆరంభంలో నేను యాక్ట్ చేసిన చాలా చిత్రాలు ఎ÷-లాప్ అయ్యాయి. దాంతో నేను ఎన్నో ట్రోల్స్ ఎదుర్కొన్నా. నాకు తెలిసి అత్యధిక ట్రోల్స్ ఎదుర్కొన్న దక్షిణాది నటిని నేనే. 'మహానటి' తర్వాత నాపై ట్రోల్స్ తగ్గాయి. విమర్శలను నేనూ స్వాగతిస్తా. వివరణాత్మక విమర్శల నుంచి కొత్త విషయాలు నేర్చుకుంటా. కానీ, కొంతమంది కావాలని నెగెటివ్ కామెంట్స్ చేస్తుంటారు. వాటిని పెద్దగా పట్టించుకోను. ఎక్కడా రియాక్ట్ కాను. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందని భావిస్తున్నా అని కీర్తి సురేశ్ తెలిపారు. పెళ్లి గురించి మాట్లాడుతూ.. ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాన్ని కొనసాగించడమే పెళ్లి అని నా భావన అని అన్నారు. దీంతో విలేకరి సింగిల్‌గా ఉంటున్నారు. బోర్‌గా అనిపించడం లేదా? అని ప్రశ్నించగా.. సింగిల్ అని నేను చెప్పలేదుగా అని నవ్వుతూ బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. కీర్తిసురేశ్ రిలేషన్‌లో ఉన్నారని పలువురు నెటిజన్లు భావిస్తున్నారు. అదే విషయాన్ని ఆమె పరోక్షంగా చెప్పిందనుకుంటున్నారు. కీర్తిసురేశ్ నటించిన తాజా చిత్రం 'రఘు తాత'. సుమన్‌కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆగస్టు 15న ఇది విడుదల కానుంది. మరోవైపు, ఆమె 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. వరుణ్ ధావన్ హీరోగా ఈ సినిమా సిద్ధమవుతోంది.



## తల్లి మనసు..తో నిర్మాతగా ముత్యాల తనయుడు




గతంలో 50కి పైగా సినిమాలను తీసిన ప్రముఖ తెలుగు దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న చిత్రం తల్లి మనసు.. కమల్ కామరాజు, రచిత మహాలక్ష్మి, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నీ చిత్రాన్ని ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కిస్తుండగా దర్శకత్వ శాఖలో విశేష అనుభవం గడించిన వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని అన్నపూర్ణా స్టూడియోలో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత పోకూరి బాబురావు క్లాప్ నివ్వగా, ఏషియన్ గ్రూప్ ఎం.డి. భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం, దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు తదితరులు పూజా కార్యక్రమాలలో పాల్గొని, చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ, 'టైటిల్ ను చూస్తేనే ఇది ఎంత మంచి సబ్జెక్టు అన్నది అర్థమవుతుంది. మా అబ్బాయి అభిరుచే ఈ బ్యానర్ స్థాపనకు కారణమయ్యింది. తల్లి పాత్ర కోసం ఎంతోమందిని ప్రయత్నించాం. ఎట్టకేలకు పాత్రలో ఒదిగిపోయే మంచి ఆర్టిస్టు రచిత దొరికారు. నా దగ్గర ఎంతో మంది సహాయ, కో- డైరెక్టర్లుగా పనిచేశారు. వి.శ్రీనివాస్ (సిప్పీ)లో అద్భుతమైన టాలెంట్ చూసి, ఆయనకు అవకాశం కల్పించాం' అని అన్నారు. దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) మాట్లాడుతూ, 'పూర్వాశ్రమంలో దర్శకత్వ శాఖలో పవన్ కల్యాణ్ గారి సినిమాలతో పాటు ముత్యాల సుబ్బయ్య, ఎస్.జె.సూర్య, త్రివిక్రమ్ గార్ల వంటి పలువురు ప్రముఖ దర్శకుల వద్ద పనిచేశాను. ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే చక్కటి కుటుంబ కథా చిత్రమిది. ఆమె మనోవేదన, సంఘర్షణను ఇందులో ఆవిష్కరిస్తున్నాం' అని చెప్పారు. చిత్ర నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ,'ఒక మంచి సినిమా తీయాలన్న సంకల్పమే ఈ సినిమాకు కారణం. నాన్న పేరు నిలబెట్టేలా ఈ సినిమా ఉంటుంది. ప్రారంభం రోజు నుంచి యాభై రోజుల పాటు నిర్విరామంగా జరిగే షెడ్యూల్ తో షూటింగ్ పార్ట్ పూర్తి చేస్తాం. నవంబర్ లేదా డిసెంబర్ లో ఈ సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

## వినూత్న కథాంశంతో సింబా



ఓ వైపు దర్శకునిగా స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూనే మరోవైపు కథా రచయితగా వినూత్నమైన కాన్సెప్ట్‌తో పలు సినిమాలకు షోరన్నర్ గా వుంటున్నారు దర్శకుడు సంపత్ నంది. గాలిపటం, పేపర్ బాయ్, ఓదెల రైల్వేస్టేషన్ ఆయన కథలతో వచ్చిన సినిమాలే. ఇప్పుడు ఆయన కథతో మరో సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అదే 'సింబా'. రంగస్థలంలో పవర్ ఫుల్ రోల్స్ లో ఆదరగొట్టిన జగపతి బాబు., అనసూయ లాంటి స్టార్స్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించడంతో సినిమా అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రకృతి నేపథ్యంలో ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్, సైంటిఫిక్ ఎలిమెంట్స్ జోడించి మురళీ మనోహర్ రెడ్డి తీసిన 'సింబా' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హైదరాబాద్ లో ఓ దారణ హత్య జరుగుతుంది. చనిపోయిన వ్యక్తి పార్థ(కబీర్ సింగ్) గ్రూపుకి సంబధించిన కీలక వ్యక్తి. దీంతో ఈ కేసును సీరియస్ గా తీసుకుంటారు పోలీసులు. విచారణ జరుగుతుండగానే మరో హత్య జరుగుతుంది. ఈ రెండు హత్యల వెనుక స్కూల్ టీచర్ అక్షిక(అనసూయ), ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ ఫాజిల్(శీనాథ్ మాగంటి) ఉన్నారని నిర్ధారించిన పోలీసులు వారిద్దరిని అరెస్ట్ చేస్తారు. ఇంతలో వీరిద్దరిని చంపాలని చూసి వ్యక్తి పోలీసుల సమక్షంలోనే హత్యకు గురౌతాడు. తర్వాత ఏం జరిగింది ? అసలు ఈ వరుస హత్యలకు కారణం ఏమిటి ? ఎవరు చంపుతున్నారు ? పార్థకి, హత్యలు చేస్తున్న వ్యక్తికి లింక్ ఏమిటి ? ఇందులో పురుషోత్తమ్ రెడ్డి(జగపతిబాబు) పాత్ర ఏమిటి ? ఇదంతా మిగతా కథ. 'సింబా'లో బయోలాజికల్ మెమరీ కాన్సెప్ట్ ఆధారంగా ఒక రివెంజ్ డ్రామాగా ఈ కథని తీర్చిదిద్దిన తీరు ఆకట్టుకునేలానే వుంటుంది. ముఖ్యంగా ఒక క్రైమ్ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్ లో పర్యావరణం, పకృతి పరిరక్షణ గురించి చెప్పిన తీరుని అభినందనీయం. నిజానికి సమాజానికి చాలా అవసరమైన అంశం ఇది. మర్డర్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ తరహాలో సినిమా మొదలౌతుంది. ఫస్ట్ హాఫ్ లో వచ్చే వరుస హత్యలు కథపై ఆసక్తిని పెంచుతాయి. సెకండ్ హాఫ్ లో అసలు పాయింట్ రివిల్ అవుతుంది. ఫారెస్ట్ మ్యాన్ గా జగపతి బాబు క్యారెక్టర్ చుట్టూ వున్న నేపథ్యం ఆసక్తికరంగా తీశారు.చాలా సన్నివేశాలు ప్రేక్షకులు ఊహకు అందిపోతుంతాయి. ఫస్ట్ హాఫ్ లో పోల్చుకుంటే సెకండ్ హాఫ్ లో వచ్చే కథనం ఆసక్తికరంగా వుంటుంది. జగపతిబాబు తన అనుభవంతో ఈ పాత్రని చాలా యీజ్ తో చేశారు. ఆయన ఇమేజ్, ఆహార్యం పాత్రకు తగ్గట్టుగా వుంది. అనసూయ, శ్రీనాథ్ మాగంటి పెర్ఫార్మెన్స్ డీసెంట్ గా వుంది. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా వశిష్ఠ సింహాకి మంచి మార్కులు పడతాయి. కబీర్ పాత్రని ఇంకా బలంగా తీర్చిదిద్దాల్సింది. గౌతమి, కస్తూరి స్పెషల్ రోల్స్ లో కనిపిస్తారు. ఇక మురళీ మనోహర్ దర్శకుడిగా తన తొలి ప్రయత్నంలోనే సక్సెస్ అయ్యాడని చెప్పాలి.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com